




Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తా తరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com    email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :150 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 09 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వెల రూ5 /-


## చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తత..

ఓటర్ల సవరణలో అక్రమాలను నిరసిస్తూ భారీ ఆందోళన

సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలనీ డిమాండ్



లోక్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్ , దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్ లను అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు హైదరాబాద్: ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన - మిగతా3లో

## 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026



హైదరాబాద్, అక్టోబరు 8:తెలంగాణలో పారిశ్రామిక విప్లవానికి, భారీ పెట్టుబడుల ఆకర్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' రాష్ట్ర రాజకీయ, ఆర్థిక భవిష్యత్తును నిర్ణయించడంలో కీలకం కానుంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు కల్పిస్తున్న ప్రోత్సాహం.. ఇప్పుడు రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెడుతోంది.2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు సుమారు 240 అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌కు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని కేవలం వ్యాపార కోణంలోనే కాకుండా, యువతకు అత్యధిక వేతనాలు లభించే ఉద్యోగాలను సృష్టించే ప్రధాన సాధనంగా చూస్తోంది. టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్.., దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న జీసీసీ మార్కెట్లలో అగ్రగామిగా నిలుస్తోంది. అనరాక్ ఫిక్కీ, జ్నినో, యునార్త్ ఐక్యూ వంటి ప్రముఖ సంస్థల నివేదికల ప్రకారం.. దేశంలో ఏర్పాటవుతున్న మొత్తం జీసీసీలలో సుమారు 40 శాతానికి పైగా వాటా హైదరాబాద్‌కే దక్కుతుండటం విశేషం. కెనడియన్ బ్యాంకింగ్ దిగ్గజం సీఐబీసీతో పాటు డోర్‌డాష్, బిట్రస్ట్, మెర్క్ షార్ప్ ఒ డోమ్, రెజెనెరాన్ ఫార్మాస్యూటికల్స్ వంటి దిగ్గజ కంపెనీలు నగరంలో తమ కేంద్రాలను ప్రారంభించడం ఇందుకు నిదర్శనం.రాజకీయంగా విపక్షాల విమర్శలను తిప్పకొట్టడంలోనూ, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ ఈ గ్లోబల్ సమ్మిట్ అధికార పార్టీకి అత్యంత కీలకం కానుంది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' కొనసాగింపుగా వస్తున్న ఈ సమ్మిట్ ద్వారా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను - మిగతా3లో



## తెలంగాణలో మండుతున్న ఎండలు..

పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండల తీవ్రత

ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభం

తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## భూమి నుంచి అంతరిక్షం వరకు జియో..

1,600 శాటిలైట్లు, 23 గ్రౌండ్ స్టేషన్లతో కనెక్టివిటీకి కొత్త విస్తరణ

6 లక్షలకు పైగా గ్రామాలకు కనెక్టివిటీ, సముద్ర ప్రాంతాలు మరియు సరిహద్దు ప్రాంతాలను అనుసంధానించే లక్ష్యం

ఐఎంసీ థీమ్ 'స్కేల్ వితౌట్ బౌండరీస్'

భూభాగం దాటి అంతరిక్షం వరకు జియో దృష్టి



న్యూఢిల్లీ, అక్టోబర్ 8: భూమిపై మొబైల్ నెట్‌వర్క్‌లు, ఫైబర్ తర్వాత ఇప్పుడు జియో దృష్టి అంతరిక్షంపై పడింది. సుమారు 1,600 శాటిలైట్లతో కూడిన ప్రతిపాదిత కాన్‌స్టెలేషన్, అలాగే భారత్‌లో 23 గ్రౌండ్ స్టేషన్లను ఏర్పాటు చేసే ప్రణాళికపై కంపెనీ పనిచేస్తోంది. భౌగోళికంగా టెరెస్ట్రియల్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేయడం కష్టమైన ప్రాంతాలకు కూడా కనెక్టివిటీని విస్తరించడం దీని లక్ష్యం. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2026లో జియో తన శాటిలైట్ కనెక్టివిటీ విజన్‌ను ప్రదర్శించింది. జియో దీనిని లి'సావరిన్ శాటిలైట్ కనెక్టివిటీ'లిగా పేర్కొంది. ఇందులో సుమారు 1,600 లో ఎర్త్ ఆర్బిట్ (LEO) శాటిలైట్లతో కూడిన ప్రతిపాదిత కాన్‌స్టెలేషన్ను ప్రదర్శించారు. డిజైన్, ఇంజినీరింగ్, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ నుంచి లాంచ్, డిప్లాయ్‌మెంట్, ఆపరేషన్స్ వరకు - మిగతా3లో

## రైతులపై కేసులు నమోదు.. అత్యంత హేయమైన చర్య

ఎమ్మెల్యే హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 08: జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసు నమోదు చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. దీనిపై గురువారం తన ఎక్స్ ఖాతా వేదికగా ఆయన స్పందించారు. 'కళ్ల ముందే ఎండుతున్న పంటలకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన బాట పట్టిన రైతులపై కేసులు నమోదు చేయడం అత్యంత హేయమైన చర్య. రేవంత్ పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారడం సిగ్గుచేటు'. 'ఇంజనీర్లతో రైతులపై కేసులు పెట్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. మీ చేతగానితనం వల్ల ఈరోజు పంటలకు నీళు అందక ఎండిపోతున్న దుస్థితి. కడుపు మండిన రైతన్న రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తారా?. పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేస్తారా? ఇదెక్కడి దుర్మార్గం? ఇదెక్కడి అన్యాయం?. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం వహించింది మీరు'.'నీళ్లను ఒడిసి పట్టకుండా, విడిచిపెట్టి తెలంగాణకు జల ద్రోహం చేసింది మీరు. తప్పు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే, శిక్ష రైతులు అనుభవించాలా?. సాగునీరు లేక, కరెంట్ లేక రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే.. పరిష్కరించాల్సింది పోయి.. కేసులు అక్రమ కేసులు పెడతారా?. ఇది ప్రజా పాలననా? లేక ప్రజా పీడననా?. రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రైతు వ్యతిరేక చర్యలు ఇలాగే కొనసాగిస్తే, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాం' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

## మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

మంత్రి గడ్డం వివేక్



సిద్దిపేట:అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వైశ్య సంక్షేమ సంఘ భవనంలో సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో గల 140 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ చీరలను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాల రూపకల్పనలో మహిళలకు పెద్దపీట వేసి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని ఋణాలు, కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాలతోపాటు, మహిళల వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు పెట్రోల్ బంక్ లను కూడా కేటాయించి ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఆదేశాలు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని లక్ష్యంతో చేపట్టిన బ్రేక్ ఫాస్ట్ పథకం ద్వారా రాష్ట్రంలో 20 లక్షల బ్రేక్ ఫాస్ట్ లను ప్రతిరోజు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ బ్రేక్ ఫాస్ట్ వలన విద్యార్థులు సంతోషంగా ఉన్నారని అన్నారు. పేదలెవరు గుడిసెలలో నివాసం ఉండరాదు అనేది ప్రభుత్వం లక్ష్యమని దానిలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తీసుకురావడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కన్నా సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ముందు వరుసలో ఉందని అన్నారు.ఒక సిద్దిపేట నియోజకవర్గంలోనే 3500 ఇండ్లకు 2500 నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం తదితర అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళలు భాగస్వాములై ప్రభుత్వ లబ్దిదారుల్లో మహిళలు అగ్రస్థానంలో ఉన్నారనీ మిగతా అన్ని ప్రభుత్వ పథకాలను మహిళలు తప్పకుండా ఉపయోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, సిద్దిపేట ఆర్డీవో సదానందం, సిద్విత నియోజకవర్గ ఆత్మ చైర్మన్ పూజల గోపికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, రెవెన్యూ మరియు మున్సిపల్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఫతేనగర్లో నాలా పూడికతీత పనులు

వరద ముప్పు తప్పేలా హైడ్రా చర్యలు

రంగంలోకి దిగిన హైడ్రా మెట్..

డీఆర్ ఎఫ్ బృందాలు

క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, అక్టోబర్ 07:ర్షం పడితే నీట మునిగే పరిస్థితి ఫతేనగర్ – బాలానగర్ పారిశ్రామిక వాడది. ఇప్పుడా పరిస్థితులు మారనున్నాయి. ఫతేనగర్ ప్రాంతాల్లో నాలా పూడిక తీత పనులను హైడ్రా ప్రారంభించింది. కల్వర్టుల వద్ద పూడిక తీస్తే సరిపోదని హైడ్రా గ్రహించింది. నాలా పొడుగునా పూడికను తొలగిస్తే తప్ప వరద ముప్పు తప్పదని భావించింది. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు హైడ్రా శ్రీకారం చుట్టింది. మాన్సూన్ ఎమర్జనీ టీమ్(మెట్), డిజాస్టర్ రెస్పాన్స్ (డీఆర్ ఎఫ్) బృందాలను రంగంలోకి దించింది. ఫతేనగర్ – బాలానగర్ - మిగతా3లో

## 71.23 లక్షల మందిని చేర్చేందుకు ఆమోదం



హైదరాబాద్, అక్టోబరు 8:తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా, తుది జాబితాలో చేర్చేందుకు 71.23 లక్షల మందిని అర్హులుగా గుర్తించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 7వ తేదీ నాటికి నోటీసులపై విచారణ పూర్తి చేసి, వీరి పేర్లు చేర్చేందుకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు.ఓటర్ల జాబితాలోని రికార్డులలో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక కారణాల రీత్యా మొత్తం 92.88 లక్షల నోటీసులు జారీ చేయగా, అందులో 91.92 లక్షల నోటీసులను ఓటర్లకు అందజేశారు. అక్టోబర్ 7వ తేదీతో క్లెయిమ్‌లు, - మిగతా3లో

వార్తాతరంగాలు



## సంపాదకీయం

# ఈసీ వర్సెస్ సుప్రీం

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు "పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్" పంపేందుకు ప్రయత్నించారు.జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింభారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ూ×= ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఫారం 6 వివాదం ముదురుతోంది. ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటే వాటిని రద్దు చేస్తామని తాజాగా సుప్రీం కోర్టు చేసిన హెచ్చరికలతో ఈసీ చిక్కుల్లో పడింది. ఫారం-6 సవరణలను తాము ఆమోదించలేదని, అవి చట్టవ్యతిరేకంగా ఉంటే రద్దు చేస్తామని నిన్న (సోమవారం) సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఫారం-6ను కొత్త ఓటర్ల నమోదు కోసం వినియోగిస్తారు. అయితే దీనిలో ఏకపక్షంగా సవరణలు చేశారని దేశవ్యాప్తంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫారం 6లో.. గత ఎస్ఐఆర్‌లో తమ పేరు/ తల్లిదండ్రుల పేరు/ తాత, నానమ్మల పేరు ఉందా అన్న విషయం తెలపాలంటూ ఈసీ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేశారంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీం కోర్టు ఘాటుగా స్పందించింది. ఆ సవరణలను తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది.మరోవైపు ఫారం-6 ఎలాంటి సవరణలూ చేయలేదని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. తాము అదనంగా ఒక డిక్లరేషన్‌ను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పింది. పైగా ఈ మార్పులను బిహార్ 'సర్'పై ఇచ్చిన మే నెల తీర్పులో సుప్రీం కోర్టు కూడా సమర్థించిందని తెలిపింది.కాగా.. ఈసీఐ అధికారిక పోర్టల్‌లో ఫారం-6కు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అదనపు డిక్లరేషన్ తప్పనిసరిగా జతచేయాలి. ఇందుకోసం ఆ పోర్టల్‌లో 'ఫిల్ ఫారం-6', 'ఫిల్ డిక్లరేషన్' అని రెండు ఆప్షన్లు ఉంటాయి. ఇప్పుడు దీనిపై వివాదం రాజుకోవడంతో డిక్లరేషన్ ఆప్షన్‌ను ఈసీ తొలగించింది. ఇప్పుడు దీన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది, ఎవరి ఆదేశాలతో ఆ పత్రాన్ని తప్పనిసరి చేశారని ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఈసీ పలు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది.ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మరో వైపు ఏఐఎంఐఎం ప్రెసిడెంట్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ విషయంపై స్పందించారు. ఫామ్ 7 దరఖాస్తుల పేరుతో ఓట్లు తొలగించాలని చూస్తే పెద్దఎత్తున ఆందోళనలకు దిగుమతామని హెచ్చరించారు. ఫామ్ 7 పేరుతో తప్పుడు దరఖాస్తులు లేదా అప్పీళ్లు సమర్పిస్తే వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి" అని కోరారు.ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా స్పందించింది."ఫామ్ 7 దరఖాస్తుల విషయంలో అనర్హమైనవి సమర్పిస్తే తగిన చర్యలు తీసుకోవాలి" అని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లకు సూచించారు.మరోవైపు, 'సర్' ప్రక్రియలో భాగంగా కర్ణాటకలో ఫామ్ 7 కింద దాదాపు నాలుగువేలకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారని,వారిలో ఎక్కువ మంది ముస్లిం ఓటర్లు ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. .మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

# మునేరులో బంగారం కోసం గాలింపు

**విజయవాడ, అక్టోబరు 8:**ఏపీలో బంగారం కోసం వేట మొదలైంది. పెనుగంచిప్రోలు దగ్గర మునేరులో కొంతమంది బంగారం కోసం వెతుకుతున్నారు. ప్రతి ఏటా ఈ ప్రాంతానికి కొందరు వచ్చి బంగారం కోసం గాలిస్తుంటారు. ఈసారి కూడా చిత్తూరు నుంచి మరికొన్ని ప్రాంతాల నుంచి వచ్చి జనాలు బంగార కోసం చూస్తున్నారు.. మునేరు మాత్రమే కాదు ఏపీలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఇలా బంగారం కోసం కొంతమంది గాలిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో పెనుగంచిప్రోలు మునేరులో బంగారం కోసం వేట కొనసాగుతోంది. అక్కడ మునేరులో బంగారం, రంగు రాళ్లు దొరకుతాయనే ఆశతో కొందరు గాలిస్తున్నారు. చిత్తూరుతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు రోజంతా మునేరులో బంగారం కోసం వెతుకుతున్నారు. పురతాన కాలంలో పెద కాంచీపురంగా ఉన్న ప్రాంతం పెనుగంచిప్రోలుగా ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ మునేరు పక్కనే పెనగంచిప్రోలు ఉంది. అక్కడ లింగేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి, తిరుపతమ్మ ఆలయం ఉంది. పెనుగంచిప్రోలులో కొన్ని దేవాలయాలు పూర్తిగా కనుమరుగుకాగా.. ఈ ఆలయాల్లోని విగ్రహాలు తవ్వకాల్లో బయటపడ్డాయి.ఓ ఇంటి



నిర్మాణానికి పునాదుల తవ్వుతున్న సమయంలో పెద్ద నంది విగ్రహం బయటపడగా.. విగ్రహాన్ని తీసుకెళ్లి శ్రీ తిరుపతమ్మ ఆలయంలో ఏర్పాటు చేశారు. మిగిలిన విగ్రహాలు విజయవాడలోని విక్టోరియా మ్యూజియంలో ఉంచారు. మునేరు పరిసరాల్లో తవ్వకాలు చేస్తుంటే విగ్రహాలు బయటపడుతున్నాయి. అక్కడ మునేరులో బంగారం ఉంటుందనే ప్రచారంతో కొంతమంది వెతుకుతున్నారు. మునేరు కాజ్‌వే పక్కన ఇసుకలో ప్రతి రోజూ కొందరు తవ్వకాలు చేస్తున్నారు. రెండు, మూడేళ్ల నుంచి మునేరు దగ్గరకు బంగారం కోసం గాలించేందుకు వస్తున్నారు. ఆలయం దగ్గర మునేరు పరిసర ప్రాంతాల్లోనే వీరంతా నివాసం ఉంటున్నారు. అక్కడ స్థానిక శివాలయం, మునేరు కాజ్‌వే వంటి ప్రాంతాల్లో ఎక్కువగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇలా రెండు, మూడు నెలలు ఉండి బంగారం కోసం వెతుకుతారు.. అనంతరం వారంతా తిరిగి సొంత ఊర్లకు వెళతారు. అప్పుడప్పుడు మునేరులో బంగారం దొరుకుతుందని.. ఆ బంగారాన్ని అమ్ముకుంటే తమ పోషణకు ఇబ్బంది లేకుండా పోతుందంటున్నారు.ఏపీలోని పలు ప్రాంతాల్లోని నదీ పరివాహక ప్రాంతాల్లో బంగారం కోసం గాలిస్తుంటారు. ఎన్నో ఏళ్లుగా కొంతమంది ఈ బంగారం కోసం వెతుకుతుంటారు. నల్లమల ప్రాంతంలో కూడా కొంతమంది బంగారం కోసం గాలిస్తుంటారు. కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్ర తీరంలో బంగారం కోసం వెతుకుతుంటారు. తమకు కొద్దిపాటి బంగారం దొరికినా జీవితాలు మారిపోతాయనే ఆశతో ఉంటారు. వర్షాలు పడిన తర్వాత బంగారం కోసం వీరు వెతుకుతుంటారు.

# ప్రివలేజ్ పన్ను ఎత్తేసేవరకు పోరాటం చేస్తాం

**హైదరాబాద్:**ప్రివిలేజ్ టాక్స్ ఎత్తి వేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ప్రకటించింది. రేపటి నుండి ఇందిరాపార్క్ లోని ధర్నా చౌక్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఎక్సైజ్ శాఖ మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద దామోదర్ గౌడ్ మాట్లాడుతూ, తమ సమస్యలను ఇప్పటికే పలుమార్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లామని.. కానీ మంత్రి సమస్యలపై దాటవేయడం సరికాదన్నారు. బార్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని వస్తుందని.. కానీ సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదన్నారు. తమ సమస్యలపై ఎక్సైజ్ కమీషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. బార్ల పరిసరాల ప్రాంతాలల్లో బెల్ట్ షాప్స్ నుండి తొలిగించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రివిలేజ్ టాక్స్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తానని కమీషనర్ హామీ ఇచ్చారని దామోదర్ గౌడ్ వెల్లడించారు. ప్రివిలేజ్ టాక్స్ ఎత్తి వేసే వరకు దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని దామోదర్ గౌడ్ స్పష్టం చేశారు.

# కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సీఎం చంద్రబాబు భేటీ

## పోలవరం, జల్ జీవన్ మిషన్ పనులపై చర్చ

**ఢిల్లీ, అక్టోబర్ 8:**పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతిని, ఇటీవల రూ.30 వేల కోట్లతో చేపట్టిన జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పనుల వివరాలను కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సీఆర్ పాటిల్ తో భేటీ అయ్యారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో సుదీర్ఘంగా పెండింగులో ఉన్న పలు అంశాలను పరిష్కారించాలని సీఎం కోరారు. ఆ రెండు రాష్ట్రాల్లో పోలవరం నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన ప్రొటెక్టివ్ ఎంబాంక్‌మెంట్స్ పనులకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందనే కారణంతో అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన స్టాప్ వర్క్ ఆర్డర్ ప్రస్తుతం అబెయన్సులో ఉన్నప్పటికీ... దాన్ని శాశ్వతంగా ఉపసంహరించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఒప్పంచాలని కోరారు. ఈ మేరకు కేంద్ర జల మంత్రిత్వ శాఖ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రాష్ట్రాల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పరస్పర సహకారం, సమన్వయం ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు వద్ద 41.15 మీటర్ల కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు అవసరమైన పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనులను త్వరితగతిన చేపడుతున్నట్టు కేంద్ర మంత్రికి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యతనిస్తున్నామో... నిర్వాసితుల సమస్యల పరిష్కారం.. పునరావాస పనులకూ అంతే ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పోలవరానికి ఎలాంటి నిధుల కొరత రాకుండా చూడాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు. అలాగే పోలవరం వద్ద 45.72 కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. చేపట్టాల్సిన పనుల పైనా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ తో సీఎం చంద్రబాబు చర్చించారు. గోదావరి నది నుంచి వేల టీఎంసీల వరద జలాలు సముద్రంలో వృధాగా కలిసిపోతున్నాయని.. ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా పట్టిసీమ ద్వారా నీటిని తరలిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి వివరించారు. పోలవరం ప్రాజెక్టును పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు



తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇటీవలే ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పనులను ప్రారంభించామని... రాష్ట్రంలో మొత్తంగా 95 లక్షల గ్రామీణ కుటుంబాలు ఉంటే... వాటిల్లో 62 లక్షల మంది ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని.. తాజాగా 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు మంచినీటి కనెక్షన్లు అందించేలా పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ పనులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, పనులకు అనుగుణంగా సత్వరం నిధులు విడుదల చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో నదుల అనుసంధానంతో కలిగే ప్రయోజనాలను కూడా సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు.

# నానా పటేకర్ కన్నుమూత

**ముంబై, అక్టోబరు 8:**భారతీయ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ నటుడు, దర్శకుడు నానా పటేకర్ (75) కన్నుమూశారు. గురువారం తెల్లవారుజామున గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్ర గుండెపోటు రావడంతో అస్వస్థతకు గురయ్యారు. అనంతరం ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఉదయం 5:20 గంటలకు ఆయన మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.నానా పటేకర్ మృతితో బాలీవుడ్‌తో పాటు మరాఠీ చిత్ర పరిశ్రమలోనూ విషాదం నెలకొంది. ఆయన కుమారుడు మల్హార్ పటేకర్ ఆ సమయంలో పుణేలో ఉండగా, తండ్రి మరణవార్త తెలిసిన వెంటనే గోవాకు బయలుదేరినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు త్వరలో మరిన్ని వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.



**'గమన్'తో మొదలైన సినీ ప్రయాణం**

1951 జనవరి 1న మహారాష్ట్రలో జన్మించిన నానా పటేకర్ 1978లో వచ్చిన 'గమన్' సినిమాతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత తన విభిన్నమైన నటన, గంభీరమైన డైలాగ్ డెలివరీ, సహజమైన నటనా శైలితో ప్రేక్షకులపై చెరగని ముద్ర వేశారు. సాధారణ హీరో పాత్రలకు భిన్నంగా.. సంక్లిష్టమైన, ప్రతికూలమైన, భావోద్వేగాలతో కూడిన పాత్రలను కూడా అద్భుతంగా పోషించడం ఆయన ప్రత్యేకత.'పరిందా', 'వజూద్', 'యశ్వంత్', 'అబ్ తక్ ఛప్పన్', 'అపహరణ', 'రాజ్‌నీతి', 'టాక్సీ నంబర్ 9211' వంటి సినిమాల్లో ఆయన నటనకు విశేష ప్రశంసలు లభించాయి. 2007లో వచ్చిన 'వెల్‌కమ్' సినిమాలో 'ఉదయ్ శెట్టి' పాత్రలో ఆయన చేసిన కామెడీ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ పాత్రను 'వెల్‌కమ్ బ్యాక్'లోనూ కొనసాగించారు.

అవార్డులతో ప్రత్యేక గుర్తింపు నానా పటేకర్ తన సినీ ప్రస్థానంలో మూడు జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం 'నటసమ్రాట్'లో అద్భుతమైన నటనకు ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటుడి అవార్డును గెలుచుకున్నారు. భారత ప్రభుత్వం 2013లో ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.నటనతో పాటు నానా పటేకర్ గాయకుడిగానూ తన ప్రతిభను చాటుకున్నారు. 'యశ్వంత్', 'వజూద్', 'ఆంచ్' వంటి చిత్రాల్లో ప్లేబ్యాక్ సింగర్‌గా కూడా పనిచేశారు.

**నాలుగు రోజుల క్రితమే బహిరంగ కార్యక్రమంలో..**

నానా పటేకర్ మరణానికి కేవలం నాలుగు రోజుల ముందు గోవాలోని డోనా పౌలాలో జరిగిన సమ్రాట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. అదే ఆయన చివరి బహిరంగ ప్రదర్శనగా నిలిచింది.సినిమాలకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ నానా పటేకర్ చురుకుగా పాల్గొన్నారు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ సంక్షోభంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సహాయం చేయడంలో ఆయన ముందుండేవారు.

**'హౌస్‌ఫుల్ 5'లో చివరిసారి..**

ఇటీవల విడుదలైన కామెడీ థ్రిల్లర్ 'హౌస్‌ఫుల్ 5'లోనూ నానా పటేకర్ కీలక పాత్రలో కనిపించారు. దశాబ్దాల పాటు హిందీ, మరాఠీ సినిమాల్లో తన నటనతో ప్రేక్షకులను అలరించిన ఆయన ఆకస్మిక మరణం భారతీయ సినీ పరిశ్రమకు తీరని లోటుగా మారింది.తీవ్రమైన భావోద్వేగాలను కళ్లతోనే పలికించగల నటుడిగా, శక్తివంతమైన సంభాషణలను తనదైన శైలిలో పలికించే కళాకారుడిగా నానా పటేకర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన పోషించిన ఎన్నో పాత్రలు, పలికించిన సంభాషణలు ప్రేక్షకుల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

# పెరిగిన ఆర్టీసీ ఎన్నికల వేడి

**హైదరాబాద్, అక్టోబరు 8:**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో గుర్తింపు సంఘం ఎన్నికల వాతావరణం వేడెక్కింది. సుదీర్ఘ కాలం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలు కేవలం కార్మిక సంఘాల హక్కుల సాధన కోసమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సుమారు 39వేల మందికి పైగా ఆర్టీసీ కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందుకే రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఈ ఎన్నికలు ప్రభావితం చేసే అవకాశం ఉందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు పదేళ్ల విరామం తర్వాత కార్మికులు రహస్య బ్యాలెట్ ద్వారా తమ నాయకులను ఎన్నుకోనుండటంతో ప్రతిష్టాత్మకంగా మారింది. ఈసారి ఎన్నికల్లో కార్మిక సంఘాలు విభిన్న కూటములుగా ఏర్పడి బరిలో నిలిచాయి. ప్రధానంగా మూడు కూటములు ఏర్పడి హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో కూడిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఒక కూటమిగా ఏర్పడ్డాయి. టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ సంయుక్తంగా జేఏసీ గా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. అలాగే తెలంగాణ జాయింట్ మజ్దూర్ యూనియన్ , బహుజన్ వర్కర్స్ యూనియన్ తదితర సంఘాలు మరో కూటమిగా బరిలోకి దిగాయి. ఈ సంఘాల వెనుక ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రధాన



రాజకీయ పార్టీల హస్తం ఉండటంతో ఈ ఎన్నికలు కార్మిక క్షేత్రాన్ని తలపించడం లేదు.. అసలుసిసలు రాజకీయ యుద్ధాన్ని తలపిస్తున్నాయి. అధికార పార్టీ మద్దతు ఉన్న యూనియన్లు ఒకవైపు, ప్రతిపక్షాల బలంతో మరికొన్ని యూనియన్లు కార్మికులను ఆకట్టుకునేందుకు విభిన్న వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రచార పర్వం ఊపందుకోవడంతో కార్మిక సంఘాలు మేనిఫెస్టోలను, భారీ డిమాండ్ల పత్రాన్ని విడుదల చేశాయి. ప్రధానంగా 40 డిమాండ్లతో కూడిన చార్టర్‌ను జేఏసీ విడుదల చేయగా, అన్ని కూటములు కూడా ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, వేతన సవరణ అమలు, ఏప్రిల్ 1, 2025 నుంచి రావాల్సిన వేతన సవరణ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న 2017, 2021 బకాయిల చెల్లింపు వంటి కీలక అంశాలను తెరపైకి తెచ్చాయి. అలాగే తార్నాక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, ప్రావిడెంట్ ఫండ్ బకాయిల క్రమబద్ధీకరణ, కొత్త బస్సుల కొనుగోలు,డిపోల అభివృద్ధి వంటి హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని చెప్పుకుంటూ నాయకులు డిపోల వారీగా ప్రచార సభలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం యూనియన్ గుర్తింపుకే పరిమితం కాకుండా, కార్మిక వర్గంలో ఏ పార్టీకి పట్టుందనే దానికి నిదర్శనంగా మారుతాయి. ప్రభుత్వ విధానాలపై కార్మికుల్లో ఉన్న అభిప్రాయాన్ని ఈ బ్యాలెట్ బాక్సులు ప్రతిబింబించే అవకాశం ఉంది. ఉద్యోగుల సంక్షేమం కోసం గతంలో జరిగిన సమ్మెలు, ఆందోళనలు, ప్రభుత్వంతో జరిగిన చర్చలు అన్నీ నేడు ఓటర్ల మదిలో మెదులుతున్నాయి. ఒకవైపు కార్మికుల హక్కుల పరిరక్షణ, మరోవైపు రాజకీయ ఆధిపత్య పోరు మధ్య నడుస్తున్న ఈ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో నూతన సమీకరణాలకు తెరలేపడం ఖాయంగా కనిపిస్తోంది. అక్టోబర్ 9న జరగనున్న ఈ ఎన్నికల్లో కార్మికులు ఎవరి వైపు మొగ్గు చూపుతారు, ఏ కూటమి విజయఢంకా మోగిస్తుంది అనేది వేచి చూడాలి!

# మగపిల్లల్ని వదలట్లేదు....

**హైదరాబాద్, అక్టోబరు 8:**తెలంగాణలో బాలురపై లైంగిక వేధింపుల కేసులు తీవ్ర ఆందోళన కలిగించే స్థాయిలో వెలుగులోకి వస్తున్నాయి. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదైనట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. గతేడాది నమోదైన 61 కేసులను కేవలం 9 నెలల్లోనే ఈ సంఖ్య దాటినట్లు సమాచారం. తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన పోక్సో చట్టం కింద 2024 నుంచి 2026 సెప్టెంబర్ వరకు తెలంగాణలో మొత్తం 127 మంది బాలురు బాధితులుగా నమోదైనట్లు వెల్లడైంది. 2024లో కేవలం నలుగురు బాలురే బాధితులుగా నమోదవగా.. 2025లో ఆ సంఖ్య ఒక్కసారిగా 61కి పెరిగింది. 2026లో సెప్టెంబర్ నాటికే మరో 62 మంది బాలుర కేసులు నమోదయ్యాయి. అయితే కేసుల సంఖ్య పెరగడాన్ని లైంగిక దాడులు అదే స్థాయిలో పెరిగినట్లు నేరుగా అర్థం చేసుకోకూడదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం, బాధితులను గుర్తించడం, బాధిత కుటుంబాలు పోలీసులను ఆశ్రయించడం వంటి కారణాలతో గతంలో వెలుగులోకి రాని ఘటనలు ఇప్పుడు రికార్డుల్లోకి వస్తుండొచ్చని వివరిస్తున్నారు. 2025లో నమోదైన 61 మంది బాల బాధితుల్లో హైదరాబాద్‌లోనే 24 మంది ఉన్నారు. ఖమ్మంలో 13 కేసులు నమోదు అయ్యాయి. 2026 తొలి 9 నెలల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 9 మంది బాలురు బాధితులుగా నమోదయ్యారు. మీర్‌చౌక్, శంషాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో ఏడుగురు చొప్పున బాధితులు నమోదైనట్లు తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించింది. గచ్చిబౌలి, హైదరాబాద్, కరీంనగర్, నిర్మల్, వరంగల్ ప్రాంతాల్లో మూడేసి కేసులు నమోదైనట్లు పేర్కొంది. బాలురపై లైంగిక వేధింపులు జరిగినప్పటికీ అనేక సందర్భాల్లో అవి బయటకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. కుటుంబం పరువు



పోతుందని.. ఇలాంటి ఘటనలు బయటికి చెబితే సమాజం ఏమనుకుంటుందనే భయం.. అవమానాలు వంటి కారణాలతో కొందరు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని పేర్కొంటున్నారు. మరోవైపు.. తమకు ఎదురైన భయానక అనుభవాన్ని తమ తల్లిదండ్రులకు కూడా చెప్పేందుకు పలువురు బాలురు భయపడే పరిస్థితులు ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా నిందితుడు తమకు తెలిసిన వ్యక్తి అయినప్పుడు బాలుడు విషయాన్ని చెప్పడానికి మరింత ఇబ్బంది పడే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తాజాగా నమోదైన రెండు కేసుల్లోనూ బాధిత పిల్లలు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతోనే ఘటనలు వెలుగులోకి వచ్చాయి. చందానగర్‌కు చెందిన 4 ఏళ్ల బాలుడిపై అతను చదువుతున్న పాఠశాలలో పనిచేసే సెక్యూరిటీ గార్డు లైంగిక దాడికి పాల్పడిన ఘటన 2024 ఫిబ్రవరిలో జరిగింది. నల్లగండ్లలోని పాఠశాలలో పనిచేసే 30 ఏళ్ల సెక్యూరిటీ గార్డు.. బాలుడిని ఆడియో, విజువల్ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత బాలుడు జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పడంతో విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. కేసును విచారించిన ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది జూలైలో నిందితుడిని దోషిగా తేల్చింది. అతడికి 5 ఏళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు బాధిత బాలుడికి రూ.1 లక్ష పరిహారం అందించాలని ఆదేశించింది. మరో ఘటనలో 10 ఏళ్ల బాలుడిపై అతడి పొరుగింట్లో ఉండే బంధువు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2023 డిసెంబర్‌లో కామాటిపుర పోలీసులు కేసు నమోదు చేశారు. 29 ఏళ్ల నిందితుడు టీవీ చూపిస్తానంటూ బాలుడిని తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఈ విషయం ఎవరికైనా చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బాలుడిని బెదిరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో కొంతకాలం బాలుడు మౌనంగా ఉన్నాడు. చివరకు నొప్పి, రక్తస్రావం రావడంతో జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది ఏప్రిల్‌లో నిందితుడిని దోషిగా నిర్ధారించి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. బాధిత బాలుడి తక్షణ అవసరాలు, వైద్యం, విద్య కోసం రూ.75 వేల పరిహారం అందించాలని సిఫార్సు చేసింది. తెలంగాణలో బాలురపై లైంగిక నేరాలకు సంబంధించి నమోదైన గణాంకాలు సమస్యలో ఒక భాగాన్ని మాత్రమే చూపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. పోలీసుల వరకు చేరని ఘటనలు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పిల్లలు భయంతో, కుటుంబ సభ్యులు సామాజిక ఒత్తిళ్ల కారణంగా మౌనం పాటిస్తే నేరాలు అధికారిక రికార్డుల్లోకి ఎక్కవని చెబుతున్నారు. అందుకే బాలల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని.. పిల్లలు చెప్పే విషయాలను నిర్లక్ష్యం చేయకుండా వారి మాటలను నమ్మి స్పందించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తమకు తెలిసిన వ్యక్తుల నుంచే ప్రమాదం ఎదురయ్యే అవకాశాన్ని కూడా విస్మరించకూడదని చెబుతున్నారు. 2026లో కేవలం 9 నెలల్లోనే 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదవడం.. బాలుర భద్రత, అవగాహన, ఫిర్యాదు వ్యవస్థలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని మరోసారి ముందుకు తెచ్చింది.

# భోపాల్ లో జైలు పరిపాలనలో మహిళా ఆఫీసర్లు సదస్సుకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్:**మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చే జైలు వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ విషయంలో మహిళా జైలు అధికారుల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. జైలు పరిపాలనలో సాంకేతికత భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లోని పోలీస్ రీసెర్డ్ అండ్ డెవలెప్ మెంట్ బ్యూరో లోని సెంట్రల్ అకాడమీ ఫర్ పోలీస్ ట్రైనింగ్ సిఏపిటి కేంద్రంలో జైలు పరిపాలనలో మహిళా ఆఫీసర్లు అనే అంశంపై 5వ జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జైలు పరిపాలనలో మహిళా సిబ్బంది పాత్ర, సేవలు, వృత్తిపరమైన అభివృద్ధి, నాయకత్వం, జైలు పరిపాలనలో ఎదురవుతున్న కొత్త సవాళ్లు, ఉత్తమ విధానాలు వంటి అంశాలపై కేంద్ర మంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. ఈకార్యక్రమంలో బీపీఆర్డీ డైరెక్టర్ జనరల్ అలోక్ మిత్తల్, ఐజీ అండ్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ అండ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ జితేంద్ర సింగ్ మీనా, పలువురు మహిళా జైలు ఉన్నతాధికారులు, విద్యా రంగ ప్రతినిధులు, జైళ్లు, సంస్కరణ పరిపాలనలో పనిచేస్తున్న నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు:ప్రజా పరిపాలనలో అత్యంత సవాళ్లతో కూడిన, సామాజికంగా ఎంతో ముఖ్యమైన రంగాల్లో పనిచేస్తున్న మహిళా అధికారుల కోసం ఇలాంటి జాతీయ వేదికను ఏర్పాటు చేసిన బీపీఆర్డీ అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. యూనిఫాం వెనుక ఉన్న మహిళలు ఉద్యోగ ఒత్తిడి, మానసిక ఆరోగ్యం, ఉత్తమ పద్ధతుల నుంచి సంస్థాగత మార్పుల వరకు, ఆదర్శ జైలు మాన్యువల్ మార్గదర్శకాల నుంచి ఆధునిక సంస్కరణాత్మక వ్యవస్థ వరకు, ఖైదీ తల్లులు వారి పిల్లలు నిర్బంధం నుంచి సంరక్షణ విషయంలో నిరంతర సహాయం వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



నాయకత్వంలో, అమిత్ షా మార్గదర్శకత్వంలో జైలు సంస్కరణలకు కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జైళ్లను ఆధునీకరించడానికి, ఖైదీల పునరావాసం, సంస్కరణలకు సహాయం చేయడానికి అవసరమైన సహకారం అందిస్తున్నాం. అయితే, ప్రస్తుత జైలు చట్టాలు, నిబంధనలు, నియమాల్లో మార్పులు చేయడంలో ప్రధాన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. యూనిఫాం సేవల్లో మహిళల పాత్రలో గత కొన్నేళ్లుగా గణనీయమైన మార్పు వచ్చింది. మహిళలు కమాండర్లు, పరిపాలకులు, శిక్షకులు, దర్యాప్తు అధికారులు, కౌన్సిలర్లు, పాలసీ నిపుణులు, సంస్థాగత నాయకులుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. జైలు పరిపాలనలో మహిళా అధికారుల పాత్ర ప్రత్యేకమైనది. జైలు వ్యవస్థ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగం. జైలులో ఉన్న వ్యక్తుల మానవీయ, మానసిక, సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని భద్రత, క్రమశిక్షణను కాపాడటం జైలు వ్యవస్థ బాధ్యత. జైలు అధికారులు- సంరక్షకులుగా, నిర్వాహకులుగా, నాయకులుగా, మార్గదర్శకులుగా ఉంటూ మార్పును తీసుకువచ్చే వ్యక్తులుగా పనిచేయాలి. మహిళా ఖైదీల నిర్వహణ, వారితోపాటు జైలులో ఉండే పిల్లల సంరక్షణ, వారి భద్రత, కుటుంబ సభ్యులతో సంబంధాలను కొనసాగించడం, ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య సహాయం, వృత్తి శిక్షణ, పునరావాసం,విడుదలకు సిద్ధం చేయడం వంటి అంశాల్లో మహిళా అధికారుల పాత్ర ఎంతో కీలకమైనది. బీపీఆర్డీ జాతీయ స్థాయిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. దీని పరిధి కేవలం పోలీసింగ్‌కు మాత్రమే పరిమితం కాదు. ఇందులో సంస్కరణాత్మక పరిపాలన, పరిశోధన, శిక్షణ, సామర్థ్య నిర్మాణం, ఉత్తమ పద్ధతులను విస్తరించాయి. బీపీఆర్డీ క్షేత్రస్థాయి అనుభవాలు, పరిశోధన ఫలితాలు, విధాన రూపకల్పన మధ్య ఒక వారధిగా పనిచేయగలదు. ఆధునిక జైలు వ్యవస్థలో మహిళా ఖైదీల అవసరాలు, పరిస్థితులు వేర్వేరుగా ఉండవచ్చని మనం అర్థం చేసుకోవాలి. అందుకే వారికి ఆరోగ్య సేవలు, ప్రసూతి మరియు ప్రజనన ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, పిల్లల సంరక్షణ, భద్రత, వ్యక్తిగత గోప్యత, విద్య, వృత్తి నైపుణ్యాలు, సమాజంలో తిరిగి కలిసే అవకాశం వంటి అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు అవసరం కావచ్చు. అందువల్ల, జైలు పరిపాలనలో మహిళల ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకునే విధానం ఉండాలి.

# చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తత..

- మొదటి పేజీ తరువాయి

చలో లోక్ భవన్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్ భవన్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం లోక్ భవన్ వద్ద నిరసనకు దిగిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయనే అనుమానాలు ప్రజల్లో నెలకొన్నాయని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీలను అరెస్ట్ చేయడం పూర్తిగా అక్రమం, అప్రజాస్వామికం అని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఓటర్ల జాబితాలో అవకతవకలకు తావులేకుండా పారదర్శకమైన ప్రక్రియను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026

- మొదటి పేజీ తరువాయి

సాధించాలనే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని విధానాలు, ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు పారిశ్రామిక వర్గాల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. పెట్టుబడిదారులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం, మౌలిక వసతులను మెరుగుపరచడం, అంతర్-విభాగ సమన్వయాన్ని పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జపాన్, పశ్చిమ ఆసియా దేశాలకు చెందిన పలు కంపెనీలు తమ భారతీయ కార్యకలాపాల విస్తరణ కోసం హైదరాబాద్ వైపు చూస్తుండటం, బలమైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా వ్యవస్థ నగరానికి అదనపు బలంగా మారుతుండటం శుభపరిణామం. మొత్తంగా, 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' కేవలం వ్యాపార సదస్సు మాత్రమే కాకుండా... తెలంగాణ రాజకీయ, ఆర్థిక పటాన్ని మార్చేసే చారిత్రక వేదికగా నిలవనుందడంలో ఎలాంటి సందేహం లేదు. పారదర్శక పాలన, వేగవంతమైన నిర్ణయాలతో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ, రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలపడానికి ప్రభుత్వం శాయశక్తుల ప్రయత్నిస్తోంది.

# భూమి నుంచి అంతరిక్షం వరకు జియో..

- మొదటి పేజీ తరువాయి

మొత్తం విలువ శ్రేణిపై భారత్‌లోనే నియంత్రణ ఉండేలా వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నది జియో విజన్. ఈ ప్రణాళికలో 23 ప్రతిపాదిత గ్రౌండ్ స్టేషన్లు కీలక పాత్ర పోషించనున్నాయి. ఇవి శాటిలైట్ నెట్‌వర్క్‌ను భారత భూభాగంలోని టెరెస్ట్రియల్ మౌలిక వసతులతో అనుసంధానిస్తాయి. అదే సమయంలో శాటిలైట్ నెట్‌వర్క్‌ను జియో ఇప్పటికే కలిగి ఉన్న టెరెస్ట్రియల్ నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రణాళిక కూడా ఉంది. జియో ప్రదర్శనలో భారత భూభాగం మరియు సముద్ర ప్రాంతాలకు 100 శాతం కవరేజ్, అలాగే 6 లక్షలకు పైగా గ్రామాలకు కనెక్టివిటీ అందించే విజన్‌ను చూపించారు. మారుమూల గ్రామాలు, ద్వీప ప్రాంతాలు, సరిహద్దు ఔట్‌పోస్టులు ప్రధాన దృష్టి ప్రాంతాలుగా ఉన్నాయి. వీటితో పాటు ఎంటర్‌ప్రైజ్ కనెక్టివిటీ, రిమోట్ సైట్లు, ఏవియేషన్, మారిటైమ్, ప్రభుత్వ రంగం, రక్షణ, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో కూడా ఈ సాంకేతికతను వినియోగించే అవకాశాలను ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో డైరెక్ట్-టు-డివైస్ **(D2D)** కాలింగ్ సదుపాయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ ఏడాది ఇండియా మొబైల్ కాంగ్రెస్ థీమ్ 'స్కేల్ విథౌట్ బౌండరీస్'. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐఎంసీ 10వ ఎడిషన్‌ను ప్రారంభించారు. సాంకేతికత, కనెక్టివిటీని సంప్రదాయ పరిమితులను దాటి విస్తరించాలన్న ఆలోచనను ఈ థీమ్ ప్రతిబింబిస్తోంది. టవర్లు, ఫైబర్ నెట్‌వర్క్‌ల పరిమితులను దాటి అంతరిక్ష ఆధారిత మౌలిక వసతుల ద్వారా కనెక్టివిటీని విస్తరించే జియో శాటిలైట్ ప్రణాళిక దీనికి ఒక సాంకేతిక ఉదాహరణగా నిలుస్తోంది. ప్రస్తుతం 1,600 శాటిలైట్లు, 23 గ్రౌండ్ స్టేషన్లు రెండూ ప్రతిపాదిత ప్రణాళికలో భాగమే. అయితే దిశ మాత్రం స్పష్టంగా ఉంది. భూమిపై ఉన్న నెట్‌వర్క్‌లను అంతరిక్ష ఆధారిత నెట్‌వర్క్‌లతో అనుసంధానిస్తూ కనెక్టివిటీని భూమి నుంచి అంతరిక్షం వరకు తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు జియో సిద్ధమవుతోంది.

# 71.23 లక్షల మందిని చేర్చేందుకు ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసింది. ఈ అభ్యంతరాలను నవంబర్ 5వ తేదీలోగా పరిష్కరించి, నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆగస్టు 17న ఎన్నికల సంఘం ఇంటింటి సర్వే అనంతరం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73.39 లక్షల మందిని మరణించిన, చిరునామా మారిన లేదా నకిలీ ఓటర్లుగా గుర్తించారు. సుమారు 57.46 లక్షల మంది శాశ్వతంగా చిరునామా మార్చుకోగా, 9.22 లక్షల మంది మరణించినట్లు, మరో 6.70 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్నట్లు వెల్లడైంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒకే ఇంటి నంబర్‌పై 15 లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు ఉన్న కేసులను క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పునఃపరిశీలన (రీ-వెరిఫికేషన్) చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని బీజేపీ కోరింది. తమ డేటా విశ్లేషణలో ఇలాంటి ఓట్లు సుమారు 1.63 లక్షల వరకు ఉన్నట్లు గుర్తించామని, వీటిని బూత్ స్థాయి అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది.

# ఫతేనగర్లో నాలా పూడికతీత పనులు

- మొదటి పేజీ తరువాయి

పరిసరాల్లో పూడిక తీత పనులు ఎలా సాగుతున్నాయనేది హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు సంబంధిత శాఖల అధికారులతో కలిసి గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్యగారు కూడా కమిషనర్ వెంట ఉన్నారు. ల్యాంగ్ ఆర్మ్ హ్యాండ్ జేసీబీతో పూడికను తొలగించే పనులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. నాలా పొడుగునా ఆక్రమణలుంటే గుర్తించి వెంటనే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువ ఆరంభంలో 25 మీటర్లు.. ఫతేనగర్ ప్రాంతాల్లో 40 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా కబ్జాలకు గురై కుంచించుకుపోయిందని హైడ్రా కమిషనర్ దృష్టికి స్థానిక అధికారులు తీసుకువచ్చారు. త్వరలోనే అక్కడి పారిశ్రామిక యూనిట్ల వారితో సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వరద కాలువకు అడుగడుగునా ఆటంకాలు..**

పరికి చెరువు, ఐడీఎల్ చెరువు నుంచి వచ్చే కూకట్‌పల్లి వరద కాలువకు గౌతంనగర్ పరిసరాల్లో ఫాక్స్ సాగర్ వరద కాలువ కలుస్తుంది. ఆరంభంలో 25 మీటర్లు, తర్వాత 40 మీటర్లకు పైగా ఉండాల్సిన వరద కాలువకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడ్డాయి. ఫతేనగర్, బాలానగర్ పరిసరాల్లో పారిశ్రామిక వాడ లే ఔట్ ప్రకారం వరద కాలువ విస్తీర్ణం స్పష్టంగా పేర్కొన్నప్పటికీ.. ఎక్కడికక్కడ కబ్జాలకు గురై కుంచించుకుపోయింది.

వార్తాతరంగాలు

శుక్రవారం 09 అక్టోబర్ 2026

# టీపీసీసీ ఛలో లోక్ భవన్ ర్యాలీ



**ట్యాంక్ బండ్:**ఓట్ల సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారంటూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమోక్రసీ' పిలుపులో భాగంగా టీపీసీసీ ఆధ్వర్యంలో 'చలో లోక్ భవన్ (రాజ్ భవన్)' ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,జూపల్లి కృష్ణారావు, వివేవెంకట్ స్వామి, అజారుద్దీన్ , వాకాటి శ్రీహరి, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత్‌లో ఉగ్రవాదులు స్టార్‌లింక్ వాడుతున్నారన్నది అబద్ధం: ఎలాన్ మస్క్



**ముంబై, అక్టోబరు 8:**భారత్‌లో ఉగ్రవాద లేదా తిరుగుబాటు సంస్థలు తమ స్టార్‌లింక్ సేవలను వినియోగిస్తున్నాయన్న వార్తలను స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. "భారత్‌లో స్టార్‌లింక్ సిగ్నల్స్ ప్రస్తుతం నిలిపివేయబడ్డాయి (స్విచ్ ఆఫ్). కాబట్టి, ఎవరైనా ఏ కారణం చేతనైనా వాటిని వినియోగించారనే వార్తల్లో వాస్తవం లేదు" అని ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు.ఇటీవల మణిపూర్-మయన్మార్ సరిహద్దు ప్రాంతాల్లోని తిరుగుబాటు గ్రూపుల నుండి భారత భద్రతా దళాలు స్టార్‌లింక్ టెర్మినల్లను స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే మస్క్ స్పందించారు. అయితే, ఒక నిర్దిష్ట ప్రాంతంలో శాటిలైట్ సిగ్నల్స్ అందుబాటులో లేనప్పుడు, కేవలం టెర్మినల్స్ ఉన్నంత మాత్రాన ఇంటర్నెట్ సేవలను పొందడం సాంకేతికంగా సాధ్యం కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.మరోవైపు, అక్టోబర్ 7న జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ 2026)లో స్పేస్‌ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ లారెన్ డ్రేయర్ మాట్లాడారు. భారత భద్రతా నిబంధనలకు అనుగుణంగా దేశంలో ఇప్పటికే 20 గేట్‌వే సైట్లను ఏర్పాటు చేశామని, వినియోగదారుల డేటా దేశ సరిహద్దులు దాటకుండా కఠిన చర్యలు తీసుకున్నామని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అవసరమైన టెలికాం అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపులు పూర్తయితే వాణిజ్య సేవలను ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ స్పష్టం చేసింది.దేశంలో ఇప్పటికీ దాదాపు 11,000 గ్రామాలకు 4జీ కవరేజీ లేదని, కొండ ప్రాంతాలు, అత్యంత మారుమూల ప్రాంతాలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించడంలో స్టార్‌లింక్ కీలక పాత్ర పోషిస్తుందని స్పేస్‌ఎక్స్ ప్రతినిధులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# నాపై పోటీ చేసి గెలువు కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్

**ఖైరతాబాద్ బరిలో దిగాలని కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్**

**ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రెఫరెండం అని వ్యాఖ్య**

**ఇండియా కూటమి 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో కీలక వ్యాఖ్యలు**



ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్' అని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఈ ఉప ఎన్నిక తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఒక రెఫరెండంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ఆ అధికారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలోనే జరగనున్న ఉప ఎన్నికలో విజయం సాధించి తీరుతామని దానం ధీమా వ్యక్తం చేశారు.

# జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం..



జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి, ఒక ఫేక్ చిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని నేరుగా నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్తూ ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతాను ట్యాగ్ చేయడం గమనార్హం.ఇటీవల 'చుట్టమల్లే' పాట వివాదానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు 'సౌత్ డిజిటల్ మీడియా' అనే ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. దీనికి జత చేసిన ఫొటోలో, ఒక వ్యక్తికి ముసుగు వేసి ఉండగా, ఆయన పక్కన పోలీసులు, కొందరు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లు కనిపించింది. ఈ ఫొటోలో కమిషనర్ సజ్జనార్ చిత్రం కూడా ఉంది. ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు.వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని, అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కంటెంట్‌ను చూసి మోసపోవద్దని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీదాన్ని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఈ ఫేక్ ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులే ప్రచారంలోకి తెచ్చినట్లు గుర్తించిన సజ్జనార్.. "మీ అభిమానుల్లో కొందరు నా ఫొటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న అంశాన్ని దయచేసి గమనించండి" అంటూ జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరారు.

# మాటల యుద్ధం....

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్




**హైదరాబాద్, అక్టోబరు 8:**సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై ఆరోపణలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్రమైన రాజకీయ యుద్ధానికి దారితీశాయి. ముఖ్యమంత్రి కుమార్తె నైమిషా రెడ్డి వ్యాపారాలు, ఆస్తులపై బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ చేసిన వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులు రాష్ట్రంలో కలకలం రేపాయి. ఇవి కేవలం రాజకీయ ఆరోపణలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇరు పార్టీల మధ్య పరిస్థితిని మరింత అగ్గి రాజేశాయి.ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల పెట్టుబడులు, ఫార్మా కంపెనీలు, ఆస్తులపై బీఆర్ఎస్ తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ముఖ్యంగా మెడికవర్ హాస్పిటల్స్, కార్ల షోరూంలు, కార్పొరేటే స్కూల్స్ అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం, పోస్టర్లు, బ్యానర్లు వేయడం పెద్ద దుమారం రేపింది. ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం.. సీఎం కుటుంబ సభ్యుల వ్యక్తిగత అంశాలను తెరపైకి తెచ్చి ఆరోపణలు గుప్పించడం అధికార వర్గానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఈ ఆరోపణలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఖండించింది. సీఎం కుటుంబానికి ఎలాంటి సంబంధం లేని వ్యాపారాలను ఆపాదించడం ద్వారా బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని తెలిపింది. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలని బీఆర్ఎస్ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నాయి.ఈ వివాదం రాజకీయ వేదికల నుంచి పోలీస్ స్టేషన్లు, హైకోర్టు వరకు చేరింది. సీఎం కుటుంబంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, క్రిశాంక్ అరెస్ట్ పరిణామాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. సికింద్రాబాద్ కోర్టు ఆయన రిమాండ్‌ను తిరస్కరించడం, ఆ తర్వాత ఆయన తరపున హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు కావడం, హైకోర్టు పోలీసులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించడం వంటి పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి ముందుగా ప్రాథమిక విచారణ జరపాలని న్యాయస్థానం స్పష్టం చేయడం పోలీసుల తీరుపై చర్చకు దారితీసింది.ఈ మొత్తం ఉదంతంలో బీఆర్ఎస్ పార్టీ దూకుడు పెంచింది. ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై ప్రశ్నించడంలో విఫలమయ్యామనే విమర్శల నుంచి దృష్టి మళ్లించేందుకే ఆ పార్టీ ఇలా చేస్తోందనే ఆరోపణలు లేకపోలేదు. అయితే.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ఆ పార్టీ నేతలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ దీనిని తీవ్రంగా తిప్పికొడుతోంది. రాజకీయంగా ఎదుర్కొలేకనే ప్రతిపక్షం నీచ రాజకీయాలకు దిగుతోందని, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని మండిపడుతోంది.రేవంత్ రెడ్డి కుమార్తె ఆస్తులు, వ్యాపారాల అంశాన్ని తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ రాజకీయం చేయాలని చూస్తున్నప్పటికీ, ఇది ఆ పార్టీకి కత్తి మీద సాములా మారింది. ఒకవైపు ఆధారాలు చూపాలని అధికార పక్షం సవాలు విసురుతుండగా, మరోవైపు చట్టపరమైన చిక్కులు, న్యాయస్థానాల జోక్యం నేపథ్యంలో ఈ వివాదం రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోం

# ఎర్రవల్లిలో 45 ఎకరాల మిస్సింగ్



**హైదరాబాద్, అక్టోబరు 8:**మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న భూమి రికార్డులను సమర్పించాలని కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 22 ఏపై శాసనసభలో గత నెల 16వ తేదీన నిర్వహించిన చర్చలో ఆ భూములపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ విచారణ పురోగతిపై మంగళవారం రాత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ పురోగతిపై సీఎం కమిటీ సభ్యులను ప్రశ్నించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉందని, కానీ తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించామని సీఎంకు అధికారులు వివరించారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని అధికారులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్ 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున, వారి భూముల రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని నిర్మించాలని సీఎం ఆదేశించారు.అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2లోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోవైపు కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినిగియోంచే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ ప్రాంతం ఆయనకు రాజకీయంగా, వ్యక్తిగతంగా అత్యంత కీలకం అన్న సంగతి తెలిసిందే. గతంలో కేసీఆర్ ఎక్కువ సమయం ఇక్కడే గడుపుతుండటంతో దీనిని రాజకీయంగానూ ఓ ముఖ్య కేంద్రంగా భావిస్తారు. దాదాపు మూడు వారాల క్రితం శాసనసభలో ఈ భూముల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించగా.. ఇప్పుడు అధికారికంగా విచారణ, నోటీసుల జారీ దశకు చేరుకుంది. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ స్పందన ఎలా ఉండబోతుందనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# కేబిఆర్ పార్క్ వివాదంలో రేవంత్ కార్నర్



**హైదరాబాద్, అక్టోబరు 8:**హైదరాబాద్‌లోనే అత్యంత కీలకమైన కేబీఆర్ జాతీయ పార్క్ చుట్టూ ఉన్న జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కారిడార్లలో ట్రాఫిక్ నివారణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ప్రారంభంలో **H-CITI** ప్రాజెక్టు కింద వందల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 14 రకాల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల సజావుగా నిర్వహణ కోసమే ఆగస్టులో పార్కు చుట్టూ రౌండ్ ది పార్క్ వన్ వే విధానాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పైలట్ ప్రాజెక్ట్‌గా అమల్లోకి తెచ్చారు. అయితే, ఈ వన్ వే పెట్టగానే ట్రాఫిక్ రద్దీ సడలిపోవడంతో, అసలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రతిపాదనలనే పక్కనబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఊహించని యూ-టర్న్ నిర్ణయం ప్రభుత్వంపై తీవ్ర విమర్శల తుఫానును తెచ్చిపెట్టింది. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు అర్బన్ ప్లానర్లు కేవలం వన్ వే విధానంతోనే ట్రాఫిక్ తగ్గుతుందని తెలియడానికి రూ. వందల కోట్ల అంచనా వ్యయాలు, ప్రణాళికలు దేనికి? అని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్ట్ పేరు చెప్పి పార్క్ చుట్టుపక్కల ఇప్పటికే అనేక చెట్లను నరికివేయడం, రోడ్లను తవ్వేసి మౌలిక వసతులను ధ్వంసం చేయడం వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని మండిపడుతున్నారు. సరైన ముందస్తు అధ్యయనం లేకుండా నిధులు వెచ్చించి పనులు మొదలుపెట్టి, ఇప్పుడు సింపుల్ పరిష్కారం లభించింది అని చెప్పి ప్రాజెక్ట్ పక్కన పెట్టడం అనాలోచిత విధానానికి పరాకాష్ట అని విమర్శిస్తున్నారు.మరోవైపు, పౌరులు, వాహనదారుల నుండి కూడా ఈ వన్ వే పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రౌండ్ తిరగడం వల్ల జంక్షన్ల వద్ద సిగ్నల్ రహిత ప్రయాణం సాగుతున్నప్పటికీ, చిన్న దూరాలకు కూడా కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిరగాల్సి రావడం వల్ల అదనపు సమయం, ఇంధనం వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు యూ-టర్న్ల వద్ద కొత్త తరహా ట్రాఫిక్ చిక్కులు వచ్చిపడుతున్నాయని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వన్ వే వల్ల సర్దుబాటు అయినా, భవిష్యత్ హైదరాబాద్ ప్రజావసరాలకు ఇది సరిపోతుందా? నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాల సంఖ్యను బట్టి చూస్తే, రాబోయే 5 నుండి 10 ఏళ్లలో కేబీఆర్ పార్క్ చుట్టూ వాహనాల రద్దీ రెట్టింపు కావడం ఖాయం. ఒక సాధారణ పోలీస్ ఆర్గనైజ్డ్ వన్ వే లూప్ తాత్కాలిక ఊరటనిస్తుందే తప్ప, పెరుగుతున్న భవిష్యత్తు నగర అవసరాలకు ఇది ఏమాత్రం శాశ్వత పరిష్కారం కాదని రవాణా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.ఇలా ముందస్తు ఆలోచనలు లేకుండా నిర్ణయాలు సవరించుకోవడం వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్లానింగ్ తీరుపై నమ్మకం సడలుతోంది. ఒకవైపు ప్రజాధనం వృథా కాగా, మరోవైపు భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా మౌలిక వసతుల నిర్మాణం నిలిచిపోవడం వల్ల దీర్ఘకాలంలో నగర ప్రజలే నష్టపోతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తాత్కాలిక సర్దుబాట్లతో సరిపెట్టకుండా, పర్యావరణాన్ని కాపాడుతూనే భవిష్యత్తు వాహన రద్దీని తట్టుకునేలా సింగిల్ ఎలివేటెడ్ కారిడార్ లేదా లోతైన సైంటిఫిక్ ప్లానింగ్‌తో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. లేనిపక్షంలో ఈ 'వన్ వే ప్రయోగం' ప్రజాధనాన్ని వృథా చేసిన మరో విఫల వ్యూహంగా చరిత్రలో మిగిలిపోతుందనడంలో సందేహం ఉండదని అంటున్నారు.

# బట్లోని బాయ్ కుంటా భూములకు హైడ్రా ఫెన్సింగ్

**హయత్ నగర్:**పెద్ద అంబర్ పెట్ డివిజన్ పరిధిలో ని కుంట్లూరు బట్లోని బాయ్ కుంటాను ఒక ఎకరా తొమ్మిది గుంటల భూమిని హైడ్రా అధికారులు కాపాడి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. పోలీసులను కుడా భారీగా మోహరించారు.

# జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు..

**14 మందిపై కేసు నమోదు**

**వనపర్తి జిల్లాలో 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు**

**జూరాల కాలువకు బలవంతంగా నీళ్లు విడుదల చేయడమే ఇందుకు కారణం**

**పంటలు ఎండిపోతున్నా అధికారులు స్పందించకపోవడంతో**

**గేట్లు ఎత్తిన రైతులు**



ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడి

నీటి కోసం ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు

సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో, జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి గురువారం వెల్లడించారు. సాగునీరు విడుదల చేయకపోవడంతో తమ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని రైతులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో, గత నెల సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం వారే నేరుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తి కాలువ ద్వారా తమ పొలాలకు నీటిని విడుదల చేసుకున్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఇరిగేషన్ డీఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే వ్యవహారంలో మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## 16.90 లక్షలు వ్యయంతో సదరం కేంద్రం విభాగం

# ప్రత్యేక భవనం ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**దివ్యాంగులకు నాణ్యతమైన పరీక్షలు నిర్వహించాలి**

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 8 (స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో లి16.90 లక్షలు వ్యయంతో నిర్మాణం చేసిన సదరం కేంద్రం విభాగం ప్రత్యేక భవనం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు హాజరయ్యారు.ఎమ్మెల్యే కి ఆసుపత్రి సూపర్డెంట్ పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.16.90 లక్షలు వ్యయంతో నిర్మాణం చేసిన సదరం కేంద్రం విభాగం ప్రత్యేక భవనం ను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.సదరం భవనం ఎమ్మెల్యే పరిశీలించడం జరిగింది.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ**

గద్వాల జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగుల కొరకు ప్రత్యేకంగా దివ్యాంగులకు భవనమును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ భవనంలో దివ్యాంగులు సదరం నిర్వహించినప్పుడు వెయిటింగ్ చేయడానికి వెయిటింగ్ హాలు అదేవిధంగా అన్ని



రకాల సౌకర్యాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు నమోదు చేయాలి నిజమైన దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు.వైద్యులు సదరం భవనంలో నందు దివ్యాంగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందజేయాలని సూచించారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కొరకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తుమ్మల విజయలక్ష్మి నరసింహులు యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్, నాగులు యాదవ్, రామలింగేశ్వర కాంమ్లే, ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్స్ మురళి, నాగిరెడ్డి, పూడూర్ కృష్ణ, ఇసాక్, సర్పంచ్ నాగేష్, నాయకులు గోవిందు, సుదర్శన్, వెంకటేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, కురుమన్న, ధర్మనాయుడు, మాల శ్రీనివాసులు, వీరేష్, చిరు, సురేష్ నాయక్, నాగార్జున్, డాక్టర్స్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం

# అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది...

**20 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య బిల్లింగ్ (భవనం ) డ డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే**

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 8 (స్కై న్యూస్):** గద్వాల నియోజకవర్గం లో గట్టు మండలం పరిధిలో గొర్లఖాన్దొడ్డి గ్రామంలో 20 లక్షల వ్యయంతో నూతన మహిళా సమైక్య బిల్డింగ్ (భవనం ) మరియు డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగింది.ఎమ్మెల్యే కి సర్పంచ్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి గారు మహిళలకు పెద్దపీటవేస్తూ మహిళలకు మహిళ సమైక్య ఏర్పాటు చేసుకొని మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్క మహిళ మహిళా సమైక్యాలు సభ్యురాలుగా ఉండాలి. మహిళాలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం వడ్డీ లేకుండా మహిళలకు రుణాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మహిళలు మహిళా సంఘాలలో సభ్యురాలుగా ఉండి ఆర్థికంగా బలోపితం కావాలని ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా సమాఖ్య



భవనంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవాలి అని తెలపారు.మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే గ్రామం నియోజకవర్గ, జిల్లా రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నప్పుడు గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు గ్రామంలో ఎప్పటి వరకు రోడ్లు నిర్మాణంలో చేయడం జరిగింది.ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం ప్రపంచం మొత్తం నీటి సమస్య ఉంది కాబట్టి రైతులు తక్కువ నీటిని ఉపయోగించి పంటలను వేసుకోవాలి పంటలను వేయరాదని సూచించారు అదేవిధంగా రైతులు నీటిని వృధా చేయరాదని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇంటిలో అర్హులైన లబ్ధిదారులకు కచ్చితంగా ఇందిరమ్మ ఇల్లులు వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.భవిష్యత్తులో గ్రామ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్ శేఖమ్మ ఆంజనేయులు, ఎంపీడీవో డిపిఓ, నాయకులు గద్వాల తిమ్మప్ప, సిద్దు, తిమ్మప్ప, నారాయణ, మధుసూదన్ రెడ్డి , నారాయణరెడ్డి, శేఖర్ గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శక్తివంతంగా తీర్చిదిద్దేందుకే సాహసోపేత నిర్ణయాలు...

**సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ మాకం చంద్రకళ**

**బిజినేపల్లి అక్టోబర్ 8 (స్కై న్యూస్)** భారతదేశంలో శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు గత 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ 2047 నాటికి వికసిక్ భారత్ దిశలో పయనించేందుకు ముందుకు సాగుతున్నారని సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ మాకం చంద్రకళ అన్నారు గురువారం మండల పరిధిలోని వట్టెం జవహర్ నవోదయ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ప్రిన్సిపాల్ నాగరాజు హాజరుకాగా ఆమె మాట్లాడుతూ భారతదేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ నేడు అభివృద్ధి మార్గంలో పయనిస్తుందని వివరించారు. దేశ రక్షణ కోసం సైనికులకు స్వేచ్ఛను ఇవ్వడంతో పాటు శత్రు దేశాలు భారత వైపు కన్నెత్తి చూడాలంటేనే వనికి పోయేలా అత్యాధునిక పరికరాలను రూపొందించడం జరిగిందని తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ ఆ రాష్ట్ర సర్వతోముకాభివృద్ధికి కృషి చేయడం వల్ల గుజరాత్ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని వివరించారు అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుధారాణి సీనియర్ ఉపాధ్యాయులు భాస్కరాచారి ఆధ్యాపకులు గణపతి తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు






**టీబీ రహిత జిల్లాకు కృషి చేయాలి.**

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 8(స్కై న్యూస్):**టీబీ వ్యాధిపై అవగాహనతో ప్రతి ఒక్కరూ టీబీ రహిత జిల్లాకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు గురువారం ఢిల్లీలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా ఇతర అతిథులతో కలిసి ' టీబీ ముక్త భారత్ అభియాన్ కోసం' నినాదంతో జోష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాలలోని ఐడిఓసి మినీ సమావేశపు మందిరంలో జోష్ కార్యక్రమాన్ని కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, టిబి వ్యాధి సోకిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు ప్రబలకుండా అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. వ్యాధి సోకిన వ్యక్తులు అవసరమైన మందులు వాడడమే కాక మంచి పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఉన్నందున ఎవరైనా సరే దాతలు న్యూట్రి ఫుడ్ అందించేందుకు ముందుకు రావాలని కోరారు. టిబి లక్షణాలు ఉన్న వ్యక్తులు సమీపంలోని వైద్యశాలలలో శ–త్షుఎ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టిబి వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లాలోని ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, మై భారత్ వాలంటీర్లు, స్నేహ గ్రూపుల సభ్యులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మండలానికి ఒక టీబి పేషంట్ ను ఎంపీడివోలు దత్తత తీసుకొని వారికి అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. అనంతరం జిల్లాలోని ఖమ్మంపాడు, కోదండపురం, బస్వాపురం, ఇటిక్యాలపాడు, గుర్రం గడ్డ టిబి ముక్త గ్రామ పంచాయతీలుగా ఎంపికైనందున సంబంధిత గ్రామాల సర్పంచులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, డిప్యూటీ డిఎంహెచ్వో అస్గర్ అలీ, ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ అయ్యపు రెడ్డి, టీబీ ప్రోగ్రాం అధికారి రాజు, వివిధ మండలాల ఎంపీడీవోలు, పలువురు సర్పంచులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు**



ఖమ్మం సెప్టెంబర్ 8 తెలంగాణ కానుక ప్రతినిధి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగిన యువత తప్పనిసరిగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని నేలకొండపల్లి బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు అన్నారు ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాకుండా ఈప్రజాప్రతినిధుల ఎంపికలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ముఖ్యమైన అవకాశం అని తెలిపారు. పట్టభద్రుల యబనియోజకవర్గ ఓటర్లుగా నమోదు కావడానికి సంబంధిత నిబంధనల ప్రకారం, అర్హత కలిగిన వ్యక్తి సాధారణంగా ఆ నియోజకవర్గంలో నివసిస్తూ అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు భారతదేశంలోని విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడై ఉండాలని పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి ఆన్ లైన్ ద్వారా గాని ఫారం18 ఉపయోగించి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు అర్హత కలిగిన వారు తమ పేర్లు ఇప్పటికే నమోదయ్యాయా లేదా పరిశీలించుకోవడంతో పాటు అవసరమైతే ఎన్నికల అధికారుల సూచనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని బొడ్డు బాబురావు కోరారు ఎన్నికల సంఘం ఓటర్ల సేవల పోర్టల్ ద్వారా ఓటరు సంబంధిత సేవలను అందిస్తోంది.ప్రత్యేకంగా మొదటిసారి పట్టభద్రులైన యువత ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకుని, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు

## 5లక్షల రూపాయలు ఎల్ ఓ సీ లెటర్ ను అందజేసిన గద్వాల ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 8 (స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గట్టు మండలం మాచర్ల గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ కేశవన్న కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 5లక్షల రూపాయలు లెటర్ ను లిగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి లి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి నాయకులు ఆలీ, రాజాగౌడ్, ఆనంద్, అంజనేయులు, కృష్ణ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్

# డా. చంద్రశేఖర్ కు ఘన సన్మానం

**ఆమనగల్లు, అక్టోబర్ 8(స్కై న్యూస్):**ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గత 30 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం కంటి పరీక్షా శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మందికి కంటి వెలుగులు ప్రసాదిస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు లయన్ డా. చంద్రశేఖర్ ను లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆమనగల్ పట్టణంలోని రాంరెడ్డి విజన్ సెంటర్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ అధ్యక్షులు లయన్ ఎంగలి బాలకృష్ణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సన్మాన సమావేశంలో డా. చంద్రశేఖర్ ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ “సర్వేంద్రియాణాం నయనం ప్రధానం” అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కళ్లను ఎంతో జాగ్రత్తగా సంరక్షించుకోవాలని, కంటి సమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా కంటి పరీక్షలుచేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వయసు పైబడిన వారు 40 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులు మధుమోహ వ్యాధిగ్రస్తులకు బిపి హై పవర్ టెన్షన్ గురైన వారు తప్పనిసరిగా తమ కండ్లను పరీక్షించుకోవాలని ఆయన సూచించారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని, నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని




పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ఎంగలి బాలకృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో కడ్తాల్, ఆమనగల్, కల్వకుర్తి పట్టణాల్లో నిరంతరం ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహిస్తూ పేద కుటుంబాలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసే విధంగా అవగాహన కల్పించడం జరుగుతుందని క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పి.ఆర్.ఓ. పాషా, జిల్లా చైర్మన్ లయన్ నటరాజ్ యాదయ్య, లయన్ కొండల్ రెడ్డి, లయన్ మోహన్ రెడ్డితో పాటు ఆసుపత్రి సిబ్బంది శిరీష లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కు వినతి

**ఆమనగల్లు, అక్టోబర్ 8(స్కై న్యూస్):** పడకల్, లింగరావుపల్లి, రామకృష్ణపురం, దేవునిపడకల్, పెద్దూర్ తండా, వెంకటాపూర్ తండా గ్రామపంచాయతీలకు సంబంధించిన పడకల్ విద్యుత్తు ఉప కేంద్రానికి ఆల్వాల్ 132 కేవీ విద్యుత్తు కేంద్రం నుంచి సరఫరా అవుతుందని, లోడు ఎక్కువ కావడంతో తరచుగా ట్రిఫ్ అవుతుందని దీంతో సక్రమంగా విద్యుత్తు సరఫరా కావడం లేదని తలకొండపల్లి సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి విన్నవించారు. చేతికొచ్చిన వరి పంటలు ఎండు తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పడకల్ సబ్ స్టేషన్ కు ఆల్వాల్ నుంచి వచ్చే ఫిడర్ కు లోడు తగ్గించాలని కోరారు. నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎమ్మెల్యేని కోరారు.



**సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించాలని వినతి**

సీసీఐ నుంచి పత్తి కొనుగోళ్ల ను ప్రారంభించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవ రెడ్డి కోరారు. మొదట పత్తి తీస్తున్న రైతులు దసరా ఖర్చుల కోసం సీసీఐ లేకపోవడంతో తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని వివరించారు. సీసీఐ కొనుగోలును త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యేకి కేశవ రెడ్డి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాకి కృష్ణ పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా ఆమనగల్లు యువనేత పద్మ అనిల్ ముదిరాజ్ నియామకం

**ఆమనగల్లు, అక్టోబర్ 08 (స్కై న్యూస్):** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన యువనేత పద్మ అనిల్ ముదిరాజ్ నియమితులయ్యారు. జిల్లా కమిటీని ప్రకటించిన అనంతరం ఈ నియామకం జరిగింది. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యత అప్పగించిన భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారికి పద్మ అనిల్ ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నరేందర్ రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నరేష్, ఇతర సీనియర్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మ అనిల్ ముదిరాజ్ మాట్లాడుతూ.. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, జిల్లాలో బీజేవైఎం ను మరింత బలోపేతం చేస్తానని, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని, ఎల్లప్పుడూ ప్రజా సేవలో ఉంటానని పేర్కొన్నారు.ఆమనగల్లుకు చెందిన యువకుడికి జిల్లా స్థాయి పదవి రావడంతో స్థానిక బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## రాజ్యాధికార సమరభేరి కి సంపూర్ణ మద్దతు..

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 8( స్కై న్యూస్)** బీఎస్పీ అధినేత కాన్సిరాం విలువ వర్ధంతి సందర్భంగా నేడు నిర్వహించే బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు బహుజన విద్యార్థి ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ తెలిపారు గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాహ్ శేఖర్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని బడంగ్పేట్ మున్సిపల్ మైదానంలో నిర్వహించే సభకు దళిత బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బహుజన సమాజ్ పార్టీ ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా అన్నారు



వార్తాతరంగాలు
శుక్రవారం 09 అక్టోబర్ 2026

## నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులుగా నేనావత్ రవి రాథోడ్ ఎన్నిక..



**ఆమనగలు, అక్టోబర్ 8(స్కై న్యూస్):**నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులుగా ఆమనగల్లు పట్టణానికి చెందిన (సాకిబండతాండ) నేనావత్ రవి రాథోడ్ నియమితులైన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ బాధ్యత నాకు అప్పగించిన పార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ముఖ్యంగా నా నియామకానికి సహకరించిన మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు శ్రీ తల్లోజు ఆచారి గారికి, జిల్లా అధ్యక్షుడు నరేంద్రరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నరేష్ చారి గారికి ప్రత్యేక ధన్యవాదాలు మరియు హృదయపూర్వక కృతజ్ఞతలు. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బీజేవైఎం బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తాను. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నాయకత్వం సూచించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, యువతను పెద్ద సంఖ్యలో పార్టీతో అనుసంధానం చేసి, బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేస్తాను. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను.

## కల్వకుర్తి నియోజకవర్గ ఒగ్గు కళాకారుల సంఘం ఏర్పాటు

**- నూతన కార్యవర్గానికి పాపిశెట్టి రాము అభినందనలు**



**ఆమనగల్లు, అక్టోబర్ 08 (స్కై న్యూస్):** కల్వకుర్తి నియోజకవర్గ ఒగ్గు బీర్ల కళాకారుల సంఘాన్ని గురువారం ఆమనగల్లు పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా బర్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా సందం వెంకటేష్ ఎన్నికయ్యారు. కల్వకుర్తి మండల అధ్యక్షుడిగా వస్పరి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాచూరు యాదయ్య, ఆమనగల్లు మండల అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కడ్తాల్ మండల అధ్యక్షుడిగా శివ పడకల్, ఉపాధ్యక్షుడిగా పట్నం రామంజన్ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము హాజరై నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించి అభినందించారు. కళాకారుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బన్నె శివ, వెంకటయ్య, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పేట మండల పిఆర్టియు నూతన కార్యవర్గం ఎన్నిక



**నారాయణపేట అక్టోబర్ 8:( స్కైన్యూస్)** నారాయణపేట మండల పి ఆర్ టి యు నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణపేట మండలం కార్యవర్గ సమావేశంలో మండల అధ్యక్షుడుగా మొల్గాన్ జనార్దన్,ప్రధాన కార్యదర్శి సాయప్ప ఎన్నికయ్యారు. ఈ సమావే శానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి గౌరవ అధ్యక్షులు ఎం రఘువీర్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం మండలంలోని ఉపాధ్యాయులకు జిల్లా సంఘానికి అందుబాటులో ఉండి సంఘ ఉన్నతికి కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా పట్టణంలో జరుగుతున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పి అర్ టి యు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై నారాయణ రెడ్డి దామరగిద్ద ఊట్కూరు మండలాల బాధ్యులు సత్యనారాయణ రెడ్డి రమేష్ రెడ్డి నరసింహారెడ్డి రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు గఫార్ నర్సింగ్ అనిల్ బాలాజీ అరవిందు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన రమేష్‌ను ఎమ్మెల్యే శంకర్ పరామర్శ

**త్వరగా కోలుకుని ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్ష**



**కేశంపేట అక్టోబర్ 8 స్కై న్యూస్:** కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగళ్ల రమేష్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. షాద్‌నగర్ విజయనగర్ కాలనీలోని రమేష్ నివాసానికి ఎమ్మెల్యే శంకర్ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ప్రమాదం జరిగిన తీరును, కాలుకు తగిలిన గాయాల వివరాలను ఎమ్మెల్యే శంకర్ అడిగి తెలుసుకున్నారు. రమేష్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కొందుర్గ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, కేశంపేట మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు గూడ వీరేశం, బాదేపల్లి సిద్ధార్థ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ. కరుణాకర్, సర్పంచులు భాస్కర్ గౌడ్, శివకుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నియోజకవర్గ చైర్మన్ జాంగారి రవి, నాయకులు ముభారక్, జమాల్‌పూర్ చందూలాల్, గోద మాధవులు యాదవ్, జె.పీ. జయప్రకాశ్ గౌడ్, సింగపాగ అనిల్ కుమార్, గడ్డం జంగయ్య, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని నైపుణ్యా లను పెంపొందించుకోవాలి

**- ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నమే.. ఆత్మవిశ్వా సంతో ముందుకు సాగాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట అక్టోబర్ 8: (స్కైన్యూస్)**విద్యార్థులు లక్ష్యాలను పెద్ద గా నిర్దేశించుకుని నైపు ణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. గురువారంనారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిం చిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ముందుగా దస రా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబ రాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాశాల రోజులను గుర్తు చేసుకోవడం ద్వారా ఎంతో నాస్టాల్జిక్‌గా అనిపిస్తోందని, విద్యార్థి దశలో స్నేహితులతో కలిసి గడిపిన సమయం జీవితంలో ఎంతో విలువైన దని పేర్కొన్నారు. కళాశాల జీవితం కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాకుం డా వ్యక్తిత్వ వికాసానికి, నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడాలని కలెక్టర్ సూచించారు. విద్యా ర్థులు తమ గురించి తాము తెలుసుకునే ప్రయత్నం చేయాలని, తమకు ఏ రంగంపై ఆసక్తి ఉంది, ఏ రంగంలో నైపుణ్యం ఉందో గుర్తించి ఆ దిశగా కృషి చేయాలని అన్నారు. ప్రాబ్లమ్ సాల్వింగ్, కమ్యూనికేషన్, పబ్లిక్ స్పీకింగ్ వంటి నైపుణ్యాల ను కళాశాల దశలోనే పెంపొందించుకోవాలని సూచించారు. ఈ రెండు, మూడు సంవత్సరాల కళాశాల జీవితం భవిష్య త్తుకు బలమైన పునాది వేసుకునే సమయమని, దీనిని విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చిన్నవిగా నిర్దే శించుకోకుండా పెద్దగా కలలు కనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సివిల్ సర్వీసెస్, యూపీ ఎస్సీ, వైద్య, చార్టర్డ్ అకౌం టెన్సీ, సైన్స్ తదితర రంగా ల్లో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కు కృషి చేయాలన్నారు. ఒకే కళాశాలలో, ఒకే తరగతి గదిలో చదువుతు న్న విద్యార్థుల్లో భవిష్యత్తు లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలను చేరుకునే వారు ఉంటారని, ఎవరి భవిష్య త్తు ఎలా ఉండాలన్నది వారు తీసుకునే నిర్ణయా లు, పెంపొందించుకునే నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవన ప్రయా ణం భిన్నంగా ఉంటుందని, ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దనిసూచించారు. కొంతమంది త్వరగా విజయాన్ని సాధిస్తే, మరి కొందరు కొంత ఆలస్యంగా విజయాన్ని అందుకోవ చ్చని, సమయం ఏదైనా లక్ష్య సాధన కోసం నిరంత రం కృషి చేయడం ముఖ్య మని అన్నారు. వివాహం, కుటుంబ బాధ్యతల అనం తరం కూడా పోటీ పరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగాలు సాధించిన అనేక మంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సాంకేతికత అందుబాటులోఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాచారం, అవకాశాలను తెలుసుకునే అవకాశం విద్యార్థులకు ఉందని కలెక్టర్ అన్నారు. అవకా శాలు లేవని భావించ కుండా, అందుబాటులో ఉన్న అవకాశాలను గుర్తిం చి వాటిని సద్వినియోగం చేసుకునేందుకు విద్యా ర్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తులను గుర్తించ డంతో పాటు కొత్త విషయా లను నేర్చుకోవాలని, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అన్నారు. ఆత్మవిశ్వాసమే విజయానికి కీలకమని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు కళాశాల జీవితాన్ని ఆనం దంగా గడుపుతూనే ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, క్రమశిక్షణతో చదువుకో వాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచు కుని, దానిలో ప్రతిభను నిరూపించుకునేలా కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ ఉన్నత విజయాలు సాధిం చాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం కళాశాల లెక్చరర్లు, విద్యార్థినులతో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆటలాడి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మున్సిప ల్ వైస్ చైర్ పర్సన్ మంజు ల, కళాశాల ప్రిన్సిపల్ మెర్సీ వసంత, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

# మాటల్లో 24 గంటలు.. మోటార్లకు కరెంటేది?

**చిలుకూరు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా లాగ్‌బుక్‌ల పరిశీలన**

**రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**





**చిలుకూరు, అక్టోబర్ 8 (స్కై న్యూస్):**వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. గురువారం చిలుకూరు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన.. వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌లు, రికార్డులను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలకు రోజువారీగా ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా అవుతోంది, ఎన్ని అంతరాయాలు ఏర్పడుతున్నాయి, లోవోల్టేజీ సమస్యకు కారణాలేమిటనే అంశాలపై విద్యుత్ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారికంగా నమోదవుతున్న సరఫరా సమయాలకు, రైతులకు వాస్తవంగా అందుతున్న విద్యుత్‌కు మధ్య వ్యత్యాసం ఉంటే దానిని స్పష్టం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. సాగు కీలక దశలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. "మాటల్లో 24 గంటల విద్యుత్.. క్షేత్రస్థాయిలో కోతలు ఎందుకు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులకు సక్రమంగా విద్యుత్ అందించలేని ప్రభుత్వానికి పాలించే అర్హత ఎక్కడిదని నిలదీశారు. విద్యుత్ కోతలు, లోవోల్టేజీ, తరచూ ఏర్పడుతున్న అంతరాయాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలకు అవసరమైన సమయంలో వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం కొనసాగితే వారి తరఫున ఉద్యమాలకు సిద్ధమవుతామని బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరించారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు...





**కరీంనగర్,అక్టోబర్ 8( స్కై న్యూస్ ):**ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్‌లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై, మహిళల ఐక్యత, ఆనందం, సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. విద్యార్థినులు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందించాలని సూచించారు. మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా. బి. రజనీ దేవి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల సామాజిక, సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థినుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు మహిళా సాధికారత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కళాశాల ప్రాంగణం బతుకమ్మలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కళాశాల వివిధ విభాగాల విద్యార్థినులు మరియు మహిళా అధ్యాపకులు బతుకమ్మలను తీరొక్క పూలతో పేర్చి అడ్మినిస్ట్రేటివ్ బ్లాకు వద్దకు చేర్చి ఆడి పాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు





**కరీంనగర్ అక్టోబర్08 ( స్కై న్యూస్ ):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆధ్వయ -2026 పేరిట స్వాగత ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థి మరియు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ విద్యార్థుల నిర్దేశించి మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని తెలియజేస్తూ చదువుతోపాటు ఎన్ఎస్ఎస్ ఎన్సిసి క్రీడల్లో ప్రతిమను చాటుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ 2047లో ప్రస్తుత యువత పాత్ర కీలకమని పేర్కొంటూ డ్రగ్స్ మద్యపానం మొదలగు దురలవాట్లకు దూరంగా ఉండి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. గౌరవ అతిథులుగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థులు శాతవాహన విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ఎన్ వి శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కళాశాలలో అధ్యాపకుల ఉపన్యాసాలు గ్రంథాలయాలు పరిశోధన శాలలు ఉపయోగించుకుంటూ మీ నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని సూచించారు. మరో గౌరవ అతిథి కరీంనగర్ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ జి తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ నవ సమాజ నిర్మాతలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీ ఆగం రావు గారు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలోని అన్ని వసతులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ జీవన నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మరియు సీనియర్ విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింప చేశాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, ఏ సి ఓ బి సంపత్ కుమార్ ఏవో బి. శ్రావణ్ కుమార్, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగాధిపతులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, డాక్టర్ ఎంఏ సలీం,, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి. సాగర్, బి. మహేష్, ఎన్. శ్రీనివాస్ అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

**2030 నాటికి టీబీ రహిత లిభారత్ సాధనే లక్ష్యం**

**జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్**





**మెదక్, అక్టోబర్ 08,(స్కై న్యూస్ ప్రతినిధి):** క్షయ వ్యాధి నిర్మూలనకు అందరం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అన్నారు. గురువారశీ సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో టి.బి. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ..2030 నాటికి దేశంలో టి.బి. (క్షయవ్యాధి)ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టి.బి. ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా జోష్ టీమ్‌లను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా వార్డు, మండల స్థాయిలో జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఇప్పటికే 13 టి.బి. ముక్త్ గ్రామ పంచాయతీలను గుర్తించడం జరిగిందని తెలిపారు. టి.బి. వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే అంటువ్యాధి అని, దగ్గు, తుమ్ముల ద్వారా ఇతరులకు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా షుగర్, బి.పి. ఉన్నవారు, పొగతాగే అలవాటు ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామాలలో నిర్వహించే వైద్య శిబిరాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసి, అనుమానితులు పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 215 యాక్టివ్ టి.బి. కేసులు ఉన్నాయని, టి బి. రోగులకు ప్రతి నెలా వైద్య సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి మందులు అందించడంతో పాటు అవసరమైన వైద్య సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా క్షయ వ్యాధి రోగులకు పోషకాహారం కోసం నిక్షయ్ పోషణ యోజన క్రింద నెలకు 1 వేయి రూపాయలు పోషణ భత్యం పూర్తి చికిత్స కాలం అందించడం జరుగుతుందని తెలిపారు. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా క్షయ రోగులను దత్తత తీసుకుని వారికి అవసరమైన పోషకాహారాన్ని అందించాలని, క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. సాధారణంగా వైద్యుల సూచన మేరకు నిర్దేశిత కాలం పాటు మందులను క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించారు. టి.బి. రోగులను దూరం పెట్టకుండా వారికి మానసిక ధైర్యం కల్పించాలని, వ్యాధి నియంత్రణకు పాటించవలసిన జాగ్రత్తలు, నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సిబ్బంది ఒక్కొక్కరు ఒక టి.బి. రోగిని దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా టి.బి. ముక్త్ భారత్ అభియాన్ ద్వారా జోష్ టీమ్‌లను ఏర్పాటు చేసి వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో సర్పంచులు, పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సమన్వయంతో పని చేసి టి.బి. నిర్మూలనకు కృషి చేయాలని, రోగులను దూరంగా ఉంచకుండా వారికి అవసరమైన సహకారం, మానసిక ధైర్యం అందించాలని సూచించారు. టి.బి. నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు మీడియా సహకారం తీసుకోవాలని తెలిపారు. టిబి నివారణ సంబంధించిన సమాచారం టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-6666 ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం టి.బి. ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేసి, టి.బి. నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్.సి.సి., మై భారత్ క్యాడెట్లు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కర్షకుని కనులలో కన్నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు!

**మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం పద్మాదేవేందర్ రెడ్డి**





**మెదక్, అక్టోబర్ 08,(స్కై న్యూస్ ప్రతినిధి):** కనీసం 15 రోజులైనా రైతులకు 12 గంటల విద్యుత్ ఇవ్వాలి.పంటలు పండితేనే రైతన్నకు మేలు..స్థానిక ఎమ్మెల్యే, అధికారులు రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం కరెంట్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలను కాపాడేందుకు కనీసం 15 రోజుల పాటు రోజుకు 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.రైతులకు సాగునీరు, విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ నిజాంపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి, రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పంటలు కీలకమైన పొట్ట దశలో ఉన్నాయని, ఈ సమయంలో సాగునీరు అందితేనే పంటలు చేతికొచ్చి రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కనీసం మరో 15 రోజుల పాటు రోజుకు 12 గంటల విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తే రైతుల పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రస్తుతం రైతులకు కనీసం ఆరు నుంచి ఏడు గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో లో-వోల్టేజీ, ట్రిప్పింగ్ సమస్యల కారణంగా రైతుల వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు."రైతులకు విద్యుత్ సమస్య వస్తే స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటే రైతుల సమస్యలను పట్టించుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు.నియోజకవర్గంలోని రైతుల పంటలు ఎండిపోతుంటే పట్టించుకోకుండా ఇతర విషయాలపై దృష్టి పెట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు.మెదక్ నియోజకవర్గ రైతులు మీకు ఓటేయలేదా? ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నది వారి సమస్యలను పరిష్కరించేందుకే కదా?" అంటూ ప్రశ్నించారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్, సాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రైతుల పంటలను కాపాడేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి. విక్రమార్క గారు,అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, కనీసం 15 రోజుల పాటు 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే రైతుల పక్షాన మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## అర్హులైన వారందరికీ పెన్షన్ల మంజూరు





**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 8 (స్కై న్యూస్):** ప్రభుత్వం అర్హులైన వారందరికీ నిబంధనల ప్రకారం పెన్షన్లు మంజూరు చేస్తుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం గద్వాల మండలంలోని మేలచెరువు, నల్ల దేవునిపల్లి గ్రామాల్లో పెన్షన్ల జిల్లా స్థాయి ధ్రువీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు పాల్గొని, దివ్యాంగుల పెన్షన్ల ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పెన్షన్లు అందేలా ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పెన్షన్లకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో కరెంటు సెగ..

**కాంగ్రెస్ సర్కార్‌పై జైపాల్ యాదవ్, దశరథ్ నాయక్ ధ్వజం!**

**ముద్విన్‌లో చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే పాలకులకు పట్టింపు లేదా?:**

**క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**



**ఆమనగల్లు, అక్టోబర్ 8(స్కై న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అప్రకటిత కరెంటు కోతలు, లో-వోల్టేజీ సమస్యలతో అన్నదాతల బతుకులు అంధకారంలోకినెట్టబడుతున్నాయని కల్వకుర్తి నియోజకవర్గంలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్,మాజీశాసనసభ్యులు గుర్కా జైపాల్ యాదవ్ గారు కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ తో కలిసి ముద్విన్ గ్రామంలో కరెంటు కోతలతో పూర్తిగా ఎండిపోయిన వరి పంటలను ఇద్దరు నేతలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు తామున్నామంటూ కొండంత భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ మోసపూరిత పాలనపై నిప్పులు చెరిగిన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్:మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు.ఎన్నికల వేళ 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అంటూదగామాటలతోఅధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నేడు కనీసం 7 గంటల నిరంతర సరఫరాను కూడా ఇవ్వలేకచేతులెత్తేసిందనిమండిపడ్డారు.కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దౌర్భాగ్య స్థితి నెలకొందని ధ్వజమెత్తారు. కరెంటు కోతల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు 25,000 చొప్పున తక్షణమే ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంనష్టపరిహారంచెల్లించాలని డిమాండ్ చేశారు.రైతుల పక్షాన నిలబడి, అసెంబ్లీ సాక్షిగానైనా, ప్రజా క్షేత్రంలోనైనా కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి తీరుతామని ఆయన హెచ్చరించారు.కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూకాంగ్రెస్ హయాంలో కరెంటు కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగలడంఖాయమనిహెచ్చరించారు. ముఖ్యంగా గిరిజన తండాలు, దళిత, వెనుకబడిన వర్గాల రైతులు లో-వోల్టేజీ సమస్యలతో తీవ్రంగా నష్టపోతున్నారని, మోటర్లు మరియు సబ్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రైతన్నలు అప్పులపాలు అవుతున్నా విద్యుత్ శాఖఅధికారులుపట్టించుకోకపోవడందుర్మార్గమన్నారు.అన్నదాతలకు పూర్తి న్యాయం జరిగే వరకు కల్వకుర్తి గడ్డపై విశ్రమించకుండా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి వచ్చేలా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ డైరెక్టర్ వీరయ్య సర్పంచ్ నీలావతి లోకేష్ నాయక్ మాజీ సర్పంచులు యాదయ్య నరసింహ గౌడ్ భాగ్యమ్మ జంగయ్య ఉపసర్పంచ్ బాలు నాయక్ మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ వినోద్ నాయకులు గోపాల్ రాజు శీను పర్వతాలు వెంకటయ్య జంగయ్య సైదులు మహేష్ వెంకటేష్ శీను సత్తయ్య హరి నవీన్ పెంటయ్య నారయ్య కృష్ణయ్య రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల దాహం తీర్చిన దాత



**పాపన్నపేట/మెదక్ ,అక్టోబర్ 08,(స్కై న్యూస్ ప్రతినిధి):** మండల పరిధిలోని కుర్తివాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన అంబిరి సతీష్ రావు పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్(ఙ్ఘవతీ ౧బతీఱటఱవతీ) అందజేశారు. దీంతో విద్యార్థులకు తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కానుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు అంబిరి సతీష్ రావును శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. పాఠశాలకు అవసరమైన సదుపాయం అందించిన దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దాత అందించిన సహాయం పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.అంబిరి సతీష్ రావు చేసిన సహాయానికి పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన తాగునీరు(ఝటవ ఐతీఱఅఎఱఅస్త్ర ఙ్ఘవతీ) అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో నీటి సౌకర్యం మరింత మెరుగుపడేందుకు ఈ నీటి సదుపాయం(Water Facility) ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు కల్పించాలి

**ప్రత్యేక అవసరాలు గల లిపిల్లల తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**








**మెదక్, అక్టోబర్ 08, (స్కై న్యూస్ ప్రతినిధి):** మెదక్: జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రుల సమావేశం మెదక్‌లోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అనేక రకాల సదుపాయాలను అందిస్తోందని తెలిపారు. ALIMCO క్యాంపుల ద్వారా అవసరమైన ఉపకరణాలను అందిస్తున్నామని, అలాగే ఎస్కార్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ వంటి సహాయాలను అందిస్తున్నామని చెప్పారు.మెదక్ జిల్లాలోని 21 భవిత కేంద్రాల్లో 194 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. సాధారణ పాఠశాలకు వెళ్లలేని పిల్లలకు భవిత కేంద్రాల్లో అవసరమైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, IERPలు వారికి విద్యాబోధన చేస్తున్నారని పేర్కొన్నారు.భవిత కేంద్రానికి కూడా రాలేని పిల్లల కోసం హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా ×జు-ూలు వారి ఇళ్లకు వెళ్లి విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 63 మంది పిల్లలకు ఈ విధంగా విద్య అందిస్తున్నట్లు చెప్పారు.భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించిన వారిలో ఇప్పటివరకు 46 మంది పిల్లలను తిరిగి సాధారణ పాఠశాలల్లోకి (మెయిన్‌స్ట్రీమింగ్) తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం జిల్లాలోని భవిత కేంద్రాల నిర్వహణకు గత సంవత్సరం ప్రభుత్వం రూ.1.06 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో జిల్లాలోని భవిత కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఓర్పుతో వ్యవహరించడం, వారికి అవసరమైన సహకారం అందించడం, వారి ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాల్సిన బాధ్యతను వివరించడం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ూవీూ సుదర్శన్ మూర్తి , ×జు ు జమీూ రాజు, ూూూ నవీన్,మురళీమోహన్, మెదక్ వీజుూ శంకర్, జిల్లాలోని ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు, ×జు-ూలు , జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట అక్టోబర్ 8( స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం నెలవారీ తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గోదాము పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. గోదాము భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. గోదాము వద్ద నిరంతర భద్రతా పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, సీ సెక్షన్ అధికారిని జయసుధ, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పై తప్పుడు ప్రచారంపై ఆగ్రహం

- పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు



**మెదక్, అక్టోబర్ 8,(స్కై న్యూస్ ప్రతినిధి):**మెదక్: నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ మంచి నాయకుడిగా ఎదుగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు.దీనిని మెదక్ నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు, అసభ్య పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మెదక్ రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్లతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ప్రజలు, అభిమానులు ఫిర్యాదులు చేస్తున్నారు.తప్పుడు ప్రచారాలు చేసే వారిని వదిలేది లేదని, చట్ట ప్రకారం శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## ధర్మాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఏపి మిథున్ రెడ్డి



**మహబూబ్‌నగర్ అక్టోబర్ 8(స్కైన్యూస్ )** జిల్లాలోని ధర్మాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి గారి మాతృమూర్తి శ్రీమతి పార్వతమ్మ గారు ఇటీవల పరమపదించిన విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి గారు ధర్మాపూర్‌లోని వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా పార్వతమ్మ గారి చిత్రపటానికి నివాళులర్పించి,నరసింహారెడ్డి గారిని మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్వతమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ధర్మాపూర్ సర్పంచ్ రాజు గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,తిరుపతి నాయక్ తదితరులు ఉన్నారు...

## మండుతున్న ఎండలు

**హైదరాబాద్, అక్టోబరు 8:**తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు.రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు

## ప్రజలకు మెరుగైన సేవలం దించడంలో

# పోలీస్-మీడియా సమన్వయం కీలకం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.

**నారాయణపేట అక్టోబర్ 8: (స్కైన్యూస్)**ప్రజలకు మెరుగైన సేవలం దించడంలోపోలీస్--మీడియా సమన్వయం కీలకం అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీ త్ ఐ ఏ ఎస్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని శాసన్‌పల్లి రోడ్‌లో గల లక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్, ప్రెస్ గెట్ టు గెదర్ కార్యక్రమా నికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీ త్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖతో పాటు ప్రజలకుసేవలందించడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజా స్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా, వాచ్ డాగ్‌గా పనిచేస్తూ ప్రభుత్వ శాఖలు, అధికారులు ప్రజ లకు అందించాల్సిన సేవ లు సక్రమంగా అందుతు న్నాయా లేదా అనే విష యాన్ని ప్రజల దృష్టికి తీసు కువెళ్తుందని పేర్కొన్నారు.పోలీసులు, మీడియా మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఎంతో అవ సరమన్నారు. పోలీసు శాఖలో రోజువారీ విధుల్లో ఎదురయ్యే సమస్యలు, లోపాలను మీడియా నిర్మాణాత్మకంగా సూచిం చడం ద్వారా వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని,



ఇందుకు మీడియా సహకారం అవసరమన్నారు.ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంపొందించడంలో మీడియా పాత్ర ముఖ్య మైనదని ఎస్పీ అన్నారు. పోలీసులపై ప్రజలకు విశ్వాసం ఉన్నప్పుడే నేరాల నియంత్రణతో పాటు సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకు రావడంలో ప్రజలు ముందు కు వస్తారని తెలిపారు. పోలీసు--ప్రజల మధ్య విశ్వాసం,సత్సంబంధాలను పెంపొందించేందుకు మీడి యా వారధిగా పనిచేస్తోం దన్నారు.కరోనా సమయం లో పోలీసులతో పాటు వైద్యులు, మీడియా ప్రతి నిధులు ప్రజలకు సేవ లందించేందుకు ముందుం డి పనిచేశారని ఎస్పీ గుర్తు చేశారు. మీడియా సేవలను కూడా అత్యవసర సేవల్లో భాగంగా గుర్తించిన పరిస్థి తులను ఆయన ప్రస్తావిం చారు.నారాయణపేట జిల్లా లో గత ఏడాది కాలంగా పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమాలు, శాంతిభద్ర తల పరిరక్షణలో పోలీసు సిబ్బంది చేసిన కృషిని ఆయన అభినందించారు. జిల్లా పోలీసు శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ లందిస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖ విజయాలు ఏ ఒక్కరి కృషి ఫలితం కాదని, ప్రతి ఒక్కరి సమష్టి కృషి తోనే సాధ్యమవుతాయని పేర్కొన్నారు.పోలీసు శాఖ కు మీడియా అందిస్తున్న సహకారానికి ఎస్పీ డాక్టర్ వినీత్ కృతజ్ఞతలు తెలి పారు. భవిష్యత్‌లోనూ ఇదే విధమైన సహకారం, సమన్వయంతో పనిచేస్తూ నారాయణపేట జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కలిసి ముందుకు సాగుదా మని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగ య్య, మహేశ్, డీ పీ ఆర్ వో రషీద్, వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులు, ప్రింట్/ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు , ఎస్ఐ వెంకటే శ్వర్లు, జిల్లా పోలీసు అధి కారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల ఐక్యతే మన బలం!

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్టోబర్ 8(స్కైన్యూస్ ):**ఆర్టీసీ కార్మికుల ఐక్యతే మన బలమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి అన్నారు. ఈరోజు తెలంగాణలో ప్రజాపాలనను అందిస్తున్న రేవంతన్న ప్రభుత్వం ముందుకు సాగుతుందంటే, అందులో ఆర్టీసీ కార్మికుల ఐక్యత, కృషి ఎంతో కీలకం. ప్రజలకు సేవ చేయడంలో మీరు చూపిస్తున్న అంకితభావానికి తెలంగాణ ప్రజల తరఫున, నా తరఫున హృదయపూర్వక అభినందనలు, తెలియజేశారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రకటించినప్పుడు, ఆ బాధ్యతను తమ భుజాలపై వేసుకొని ప్రజాసేవలో ముందుకు తీసుకెళ్తున్న ప్రతి ఒక ఆర్టీసీ కార్మిక సోదరుడికి అయన కృతజ్ఞతలు తెలిపారు నాడు ప్రజా ఉద్యమాల కోసం గద్దర్ అన్న ఏ పాట పాడారో, ఈరోజు అదే




స్ఫూర్తితో అశ్వత్థామ రెడ్డి విజయానికి మద్దతుగా ఇక్కడికి వచ్చి మన కార్మిక సోదరుల ఐక్యతను చాటుతున్నారని ఈ జనసముద్రాన్ని చూస్తుంటే విషయం స్పష్టంగా తెలుస్తోందని



అశ్వత్థామ రెడ్డి బంపర్ మెజారిటీతో గెలవడం ఖాయమని అన్నారు.

# బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఏపి మిథున్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్టోబర్ 8(స్కైన్యూస్ )** జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి గారు పాల్గొని విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా ఏపి మిథున్ రెడ్డి అయన మాట్లాడుతూ.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు,యువతీ యువకులు ఆనందోత్సాహాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి,ప్రకృతి ప్రేమకు ప్రతీక అని అన్నారు.విద్యార్థి దశ నుంచే మన సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా



సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలను నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవేజ్,తిరుపతి నాయక్,అనుప శేఖర్,మాజీ ఎన్ ఎస్ యు



రాష్ట్ర కార్యదర్శి రమేష్,శివ జోగి,నవీన్,హరీష్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు...

# తీర్థ, ప్రసాదాలు తిన్నట్టు నటిస్తారు

టీటీడీ బోర్డు రద్దు చేస్తాము

**తిరుపతి, అక్టోబరు 8:**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇవాళ తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొందరు ఆలయాలకు వెళ్లినప్పుడు అర్చకులు తీర్థం ఇస్తే, తాగినట్లు నటిస్తూ వేళ్ల సందుల్లోంచి కిందకు వదిలేస్తారని, ఇదే వారు పాటించే సెక్యులరిజం అని ఆయన విమర్శించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన, తాను స్వచ్ఛమైన హిందువునని, ఇతర మతాల ప్రార్థనా స్థలాలకు కూడా వెళతానని అన్నారు.ఈ సందర్భంగా ఏపీలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసేలా తమ పార్టీ ఉంటుందని తెలిపారు. అధికార టీడీపీ కూటమి, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తర్వాత తమ పార్టీ మూడో ప్రధాన శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిలబడుతూ, ప్రభుత్వం, ప్రతిపక్షంపై నిర్మాణాత్మక విమర్శలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై కూడా సాయిరెడ్డి స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లడ్డూ తయారీలో అక్రమాలు జరిగాయని అంగీకరించారు. అయితే, ప్రసాదంలో జంతు కొవ్వు ఉందన్న ఆరోపణలను ఆయన గట్టిగా ఖండించారు. తాము కిలో నెయ్యిని రూ. 320-400 మధ్య కొంటే, ప్రస్తుత ప్రభుత్వం రూ. 658కి కొంటోందని, బహిరంగ మార్కెట్‌లో స్వచ్ఛమైన నెయ్యి ధర రూ. 1,000 పైనే ఉందని పేర్కొంటూ నెయ్యి నాణ్యతను ప్రశ్నించారుకడప జిల్లాలోని కొన్ని ఆలయాల్లోకి ఇప్పటికీ దళితులను అనుమతించడం లేదని ఆరోపించిన ఆయన... తమ పార్టీ అధికారంలోకి వస్తే అలాంటి వివక్ష చూపేవారికి కఠిన శిక్షలు, జైలు శిక్ష తప్పవని



హెచ్చరించారుహిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా తాము రాబోతున్నామని స్పష్టం చేసిన విజయసాయిరెడ్డి, తమ పార్టీ అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిని పూర్తిగా రద్దు చేస్తామని సంచలన ప్రకటన చేశారు. ఇకపై టీటీడీ బోర్డులో రాజకీయ నాయకులకు ఎలాంటి ప్రవేశం ఉండదని, కేవలం పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలతోనే ధార్మిక బోర్డును ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, తిరుపతి క్షేత్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయడంతో పాటు, ప్రపంచస్థాయి హిందూ ధార్మిక సంస్థను తిరుపతిలో నెలకొల్పుతామని భారీ హామీలు ఇచ్చారు. వైఎస్ జగన్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ గారూ.. మీకు రెడ్ల ఓట్లు నిజంగా కావాలనుకుంటే మళ్లీ స్వధర్మానికి, హిందూ మతానికి తిరిగి రండి. అప్పుడే మీ పేరులోని జగన్మోహన్ రెడ్డి అనే పదానికి నికరమైన సార్థకత చేకూరుతుంది అని హితవు పలికారు. ఇదే క్రమంలో విదేశీ అక్రమ వలసలు, రోహింగ్యాల అంశంపై సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, బర్మా నుంచి వచ్చిన అక్రమ రవాణాదారులు ఏపీలోని గ్రామాల్లో నివసిస్తున్నారని, దీనివల్ల పౌరులు మైనారిటీలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఓటర్ల జాబితా నుంచి నిజమైన పౌరుల పేర్లు తీస్తే తప్పే కానీ, ఇటువంటి డూప్లికేట్ ఎంట్రీలు, అక్రమ సెటిలర్ల పేర్లను తొలగించడంలో ఎలాంటి తప్పులేదని సమర్థించారు.ఇక తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం, నెయ్యి కొనుగోలు వివాదంపై చంద్రబాబు ప్రభుత్వాన్ని విజయసాయిరెడ్డి నిలదీశారు. మార్కెట్‌లో కిలో మంచి నెయ్యి ధర రూ. 1000 ఉంటే, ఇందాపూర్ డైరీ పేరుతో కేవలం రూ. 658 లకే తిరుమలకు నెయ్యిని ఎలా సప్లై చేస్తున్నారని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిలో నెయ్యిని రూ. 320 నుంచి రూ. 411 మధ్య కొనుగోలు చేశారని గుర్తుచేసిన ఆయన, కిలోకు రూ. 250 చొప్పున అన్‌అఫీషియల్ పేమెంట్లు జరిగాయని వస్తున్న ఆరోపణలపై కూటమి ప్రభుత్వం నోరు విప్పాలని, చంద్రబాబు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తిరుపతి ప్రెస్ మీట్ ద్వారా విజయసాయిరెడ్డి అటు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని, ఇటు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఒకేసారి టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో హిందూత్వ కార్డ్, టీటీడీ ప్రక్షాళన అంశాలే ప్రధాన అజెండాగా తమ కొత్త పొలిటికల్ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందనే స్పష్టమైన సంకేతాలను ఆయన ఈ సమావేశం ద్వారా పంపించారు.

# యూపీఐ చెల్లింపుల వెనుక ఖర్చెవరిది?

భారతదేశంలోని డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఒక విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. ఒక క్యూఆర్ కోడ్‌తో క్షణాల్లో డబ్బు చెల్లించవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఎలాంటి రుసుము లేకపోవడం యూపీఐ విస్తరణకు ప్రధాన కారణాల్లో ఒకటి. అయితే అధిక విలువ కలిగిన కొన్ని వ్యాపార లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయం యూపీఐ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నది. 2026 అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన నిర్దిష్ట వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తించనున్నది. ఇకపై యూపీఐ వాడిన ప్రతిసారీ వినియోగదారుడు రుసుము చెల్లించాల్సి వస్తుందని కాదు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి చేసే చెల్లింపులు ఉచితంగానే ఉంటాయి. అలాగే రూ.2,000 వరకు చేసే వ్యాపార చెల్లింపులపైనా ఈ రుసుము ఉండదు. క్యూఆర్ కోడ్ ద్వారా యూపీఐ చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా కొన్ని రక్షణలు కల్పించారు. కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం దాదాపు 96 శాతం వ్యాపార లావాదేవీలు ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఎండీఆర్ అనేది వినియోగదారుడిపై నేరుగా విధించే పన్ను కాదు. వ్యాపారి డిజిటల్ చెల్లింపును స్వీకరించడానికి చెల్లించే వ్యవస్థాపక రుసుము. ఉదాహరణకు రూ.10,000కు సంబంధించిన లావాదేవీపై 0.4 శాతం రుసుము అంటే రూ.40 అవుతుంది. కొన్ని లావాదేవీలకు గరిష్ఠ పరిమితులు, కొన్ని ముఖ్యమైన రంగాలకు ప్రత్యేక రేట్లు కూడా ఉన్నాయి. ఈ మార్పు వెనుక ఆర్థిక కారణం కూడా ఉన్నది. యూపీఐ వినియోగదారుడికి ఉచితంగా కనిపించినప్పటికీ, దాన్ని నిర్వహించడం మాత్రం ఉచితం కాదు. బ్యాంకులు, చెల్లింపు సంస్థలు సర్వర్లు, సైబర్ భద్రత, మోసాల నివారణ, సమాచార వ్యవస్థల నిర్వహణ, వినియోగదారుల సేవల కోసం నిరంతరం ఖర్చు చేయాలి. 2026 ఆగస్టులోనే యూపీఐ ద్వారా సుమారు రూ.2,400 కోట్ల లావాదేవీలు జరిగాయి. వాటి మొత్తం విలువ దాదాపు రూ.27.7 లక్షల కోట్లు. ఇప్పటివరకు జీరో ఎండీఆర్ విధానాన్ని ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాల ద్వారా



కొనసాగించింది. దీని వల్ల చిన్న దుకాణదారుడు కూడా ఎలాంటి లావాదేవీ రుసుము గురించి ఆలోచించకుండా యూపీఐ చెల్లింపులను స్వీకరించగలిగాడు. అయితే యూపీఐ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ మొత్తం వ్యవస్థ నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే భరించాలా? కొత్త మార్గాలను అన్వేషించడం అవసరమా అనే చర్చ జరుగుతున్నది. యూపీఐ చెల్లింపులపై రుసుము విధించడంపై రాజకీయ వివాదం కూడా ఉన్నది. అమెరికా ఒత్తిడి, అంతర్జాతీయ చెల్లింపు సంస్థల ప్రయోజనాల కారణంగానే ఈ మార్పు తీసుకొచ్చారని ప్రతిపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. వీసా, మాస్టర్ కార్డ్ వంటి అంతర్జాతీయ చెల్లింపు సంస్థలు సాధారణంగా వ్యాపారుల నుంచి రుసుములు వసూలు చేసే విధానంలో పనిచేస్తాయి. దీనికి భిన్నంగా భారతదేశం యూపీఐని దాదాపు జీరో రుసుముతో అభివృద్ధి చేసింది. రాజకీయ వివాదాల సంగతి పక్కనపెడితే అసలు ఆందోళన మాత్రం చిన్న వ్యాపారులపై పడే ప్రభావం. పెద్ద వ్యాపార సంస్థ ఒక చిన్న రుసుమును భరించగలిగినా, తక్కువ లాభాలతో నడిచే చిన్న దుకాణదారుడికి అది భారంగా మారుతుంది. వ్యాపారి ఆ ఖర్చును తన లాభంలో నుంచి భరించవచ్చు, లేక పోటీ పరిస్థితులను బట్టి వస్తువులు, సేవల ధరల్లో పరోక్షంగా సర్దుబాటు చేయవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఈ రుసుమును వేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ, ఆ నిబంధన అమలు ఎలా జరుగుతుందన్నది కీలకం. అందువల్ల యూపీఐపై చర్చను 'ఇక నుంచి చెల్లింపులకు రుసుము' అనే సరళమైన ప్రశ్నకు పరిమితం చేయకూడదు. యూపీఐ విజయానికి కారణమైన సరళత, తక్కువ వ్యయం, ప్రజల నమ్మకం దెబ్బతినకుండా, ఈ భారీ డిజిటల్ మౌలిక వ్యవస్థను దీర్ఘకాలం ఆర్థికంగా నిలకడగా ఎలా నిర్వహించాలన్నదే అసలు ప్రశ్న. యూపీఐని కోట్లాది ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన నమూనాను కాపాడుతూనే, దాని నిర్వహణ ఖర్చును ఎవరు, ఎంతవరకు భరించాలి? ఈ ప్రశ్నకు సమతుల్యమైన సమాధానమే భవిష్యత్తులో యూపీఐ విజయాన్ని నిర్ణయిస్తుంది.

# ఈసీ వివాదం.. ప్రజాస్వామ్య గందరగోళం



ఎన్నికల సంఘం కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు కేవలం అధికార-విపక్షాల మధ్య సాగే రాజకీయ రగడ మాత్రమే కాదు, ఇది రగులుతున్న కాగడా. అది సంస్థాగత చట్టబద్ధతకు, పారదర్శకతకు సంబంధించిన లోతైన ప్రశ్న. భారత ఎన్నికల సంఘం ఈసీఐ) సాధారణ ప్రభుత్వ విభాగం కాదు. ఇది రాజకీయ, ప్రభుత్వ కుట్రల ఎత్తుగడలు, ఏ పనిచేసైనా గెలిచితీరాలి అనే నిరంతర ఎన్నికల దుర్మార్గాలు. రాజ్యాంగం అధికరణ 324 కింద ఏర్పాటైన ఒక స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ ఈసీ. ఓటరు జాబితా తయారీ నుంచి ఎన్నికల నిర్వహణ వరకు దీని నిర్ణయాలు దేశ ప్రజాస్వామ్య పునాదులను నిర్దేశిస్తాయని పాఠాలు వింటున్నాం. మరోవైపు ఇటీవల ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై కథనాలు వెలువడుతున్నాయి. సీఈసీ తీరుపై పోరాటాలు, ఆందోళనలు ధర్నాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక వెల్లడించిన అంతర్గత పత్రాల ప్రకారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్) ప్రక్రియ తీరుపై 10 నెలల్లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు (సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి) 14 సార్లు కీలక అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొన్నది. అభ్యంతరాల్లో కీలకమైనది, ఫామ్ 6 మార్పు. కొత్త ఓటరు నమోదు కోసం ఉద్దేశించిన 'ఫామ్ 6'లో పౌరులు తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు గత జాబితాలో ఉన్నాయా లేదా చెప్పే ఒక డిక్లరేషన్‌ను ఈసీ పొందుపరిచింది. నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన ఫామ్‌ను మార్చాలంటే 'రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960'కు సవరణ చేయాలి. అలాంటి సవరణ ఏదీ లేకుండా, కమిషన్ పూర్తి ఆమోదం లేకుండా మార్పులు ఎలా జరిగాయన్నది కీలక ప్రశ్న. 'నమోదు' పేరుతో, 'తొలగింపు' అధికారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్' (ఈఆర్‌వో) పరిధిలోనిది. అయితే, కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ వ్యవస్థల ద్వారా స్థానిక అధికారుల నిర్ణయాలను తలకిందులు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. చట్టం కల్పించిన అధికారాలను ఒక కంప్యూటర్ కోడ్ లేదా కేంద్ర సర్వర్ అధిగమించకూడదు. ఉదాహరణకు బెంగాల్ అప్పీళ్ల వివాదం. లక్షల సంఖ్యలో ఓటర్ల తొలగింపు, పునరుద్ధరణలకు సంబంధించి ఎన్నికల సంఘం పేరిట దాఖలైన అప్పీళ్లకు చట్టబద్ధమైన ముందస్తు అనుమతి ఎవరిచ్చారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. కొంచెం గతం నుంచి తవ్వుకుంటే తప్పు అర్థం కాదు. సంస్థాగత విశ్వసనీయత విషయంలో రాజకీయ పార్టీల వైఖరి ఏ విధంగా మారుతుందో చెప్పేందుకు 2006- 2026 మధ్య కాలంలోని పరిస్థితుల పోలిక అద్దం పడుతుంది. 2006లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ పాలనలో ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాను తొలగించాలంటూ బీజేపీ మిత్రపక్షాలకు చెందిన 205 మంది ఎంపీల సంతకాలతో రాష్ట్రపతికి వినతిపత్రం ఇచ్చింది. కాంగ్రెస్‌కు చెందిన ఒక ట్రస్టుతో నవీన్ చావ్లా కుటుంబ సభ్యులకు ఆర్థిక సంబంధాలు ఉన్నాయని తెలిపింది. నాటి ప్రతిపక్ష బీజేపీ నీతులు వేరు. ఇప్పుడు స్వయంగా కమిషనర్లే ఎన్నికల విధానాలు, సాఫ్ట్‌వేర్ మార్పులపై అంతర్గతంగా అభ్యంతరం తెలుపుతున్నారు. నిర్ణయాలు చట్టబద్ధ అధికారాలతో జరుగుతున్నాయా లేదా అనే సంస్థాగత వివాదం నెలకొన్నది. టీఎన్ శేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు స్పష్టం చేసినట్టు, ఎన్నికల సంఘంలో మెజారిటీ నిర్ణయాలు చెల్లుతాయి. భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. అయితే ప్రతి నిర్ణయమూ చట్టబద్ధమైన అధికారం ద్వారా జరిగిందా, దానికి సంబంధించిన లిఖితపూర్వక మినిట్స్ ఉన్నాయా అనేదే అసలు ప్రశ్న. రాజకీయ ఆరోపణలు పక్కనపెట్టి, ఎన్నికల సంఘం విశ్వసనీయత నిలబడాలంటే ఐదు ప్రశ్నలకు లిఖితపూర్వక డాక్యుమెంటరీ ఆధారాలతో సమాధానాలు లభించాలి. వివాదాస్పదమైన పరిపాలనా, సాంకేతిక మార్పులకు అసలు అనుమతి ఇచ్చింది ఎవరు? ఏ చట్టం లేదా ఏ నిబంధన ప్రకారం ఆ మార్పులను అమలు చేశారు? పూర్తిస్థాయి త్రిసభ్య కమిషన్ ముందు ఈ ప్రతిపాదనలు ఉంచి చర్చించారా? వ్యతిరేకత వచ్చినప్పుడు చట్టబద్ధమైన మెజారిటీ లేదా ఏకగ్రీవ పద్ధతిని పాటిస్తూ రికార్డు నమోదు చేశారా? సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు, సెంట్రల్ డేటాబేస్ ద్వారా స్థానిక ఎన్నికల నమోదు అధికారుల (ఈఆర్‌వో) అధికారాలను అధిగమించారా? అనూప్ బరన్‌వాల్ కేసులో సుప్రీంకోర్టు సూచిం చిన త్రిసభ్య ప్యానెల్ (ప్రధాని, ప్రతిపక్ష నేత, సీజేఐ) స్థానంలో కేంద్రం తెచ్చిన 2023 చట్టం ద్వారా సీజేఐ స్థానంలో కేంద్ర మంత్రి చేరారు. ఇది ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై న్యాయపరమైన సందేహాలకు తావిచ్చింది.

గతంలో ఓటర్ల చేర్పులు, తొలగింపులు పూర్తిగా స్థానిక అధికారుల పరిశీలన ఆధారంగా జరిగేవి. నేడు కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌లు రావడంతో, క్షేత్రస్థాయి పరిశీలనను దాటి కేంద్ర సర్వర్‌లే కీలక నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయనే సాంకేతిక సవాళ్లు ముందుకు వచ్చాయి. కమిషన్ లోపల జరిగే చర్చలు గతంలో బయటకు వచ్చే వి కావు. అయితే ఇటీవలి దస్త్రాలు బహిర్గతం కావడంతో కమిషనర్ల మధ్య విధానపరమైన అసమ్మతి ఉన్నట్టు వెలుగుచూసింది. పాలక పక్షంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా మాట్లాడటం రాజకీయ విన్యాసమే తప్ప రాజ్యాంగ నైతికత కాదు. ఎన్నికల సంఘం ఏ ఒక్క రాజకీయ కూటమి పక్షాననో ఉండటం కాదు, రాజ్యాంగం వైపు నిలబడటమే భారత ప్రజాస్వామ్యానికి రక్ష.

**2023 చట్టం వచ్చిన మార్పులు?**

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కేంద్రం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్-2023 ఆమోదింపజేసింది. సుప్రీంకోర్టు ఏమంటే ఏమున్నది.. పాలకపక్షానికి మెజారిటీ ఉన్నది. చట్టం ప్రతులను ఎంపీలు చదివినా చదువకపోయినా చట్టం తయారవుతుంది. ప్ర ధాని నామినేట్ చేస్తే కేంద్రమంత్రి సరే అంటా రు. కమిటీలో ప్రతిపక్షనేత ఉన్నా లేకపోయినా, ఆ ఇద్దరి నిర్ణయాన్ని వద్దన్నా అనకపోయినా ని యామకాలు జరిగిపోతాయి. ప్రభుత్వానికి 2:1 నిష్పత్తిలో వీటో స్థాయి అధికారం లభిస్తుంది.

సుప్రీంకోర్టులో తాజా పిటిషన్ల వాదనలు కేంద్రం తీసుకొచ్చిన 2023 చట్టం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి, స్వేచ్ఛాయుత-నిష్పాక్షిక ఎన్నికల సూత్రానికి విరుద్ధమని పేర్కొంటూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్, డాక్టర్ జయ ఠాకూర్ తదితరులు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఎంపిక కమిటీ నుంచి సీజేఐని తొలగించి కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా కమిటీలో ప్రభుత్వం సంపూర్ణ ఆధిక్యత సంపాదించిందని, ప్రతిపక్ష నేత ఉనికి కేవలం నామమాత్రపు లాంఛనంగా మారిపోతుందని తెలిపారు. ఎన్నికల సంఘంపై కార్యనిర్వాహక వర్గానికి సంపూర్ణ నియంత్రణ దక్కడం వల్ల రాజ్యాంగ స్వతంత్రత దెబ్బతింటుందని పేర్కొన్నారు.

పిటిషన్లను విచారించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం భిన్నాభిప్రాయాలతో తీర్పు ఇచ్చింది. ఈసీ స్వతంత్రంగా ఉండటమే కాదు, స్వతంత్రంగా పనిచేస్తున్నట్టు ప్రజలకు కనిపించాలని జస్టిస్ దీపాంకర్ దత్తా స్పష్టంచేశారు. అంపైర్‌ను ఎన్నుకోవడంలో ఒక పక్షానిదే పైచేయి ఉంటే, నిర్ణయాల విశ్వసనీయత దెబ్బతింటుందని తెలిపారు. రాజ్యాంగ సూత్రాలు ఇప్పటికే స్థిరపడ్డాయని, ప్రస్తుత ధర్మాసనమే ఈ చట్టాన్ని సమీక్షించవచ్చని భావించారు. ఇక జస్టిస్ సతీష్ చంద్ర శర్మ తీర్పులో పార్లమెంటు చేసిన చట్టంపై రాజ్యాంగబద్ధమైన లోతైన ప్రశ్నలు ఉన్నందున, దీనిని విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తేల్చాల్సి ఉన్నదని అభిప్రాయపడ్డారు.

**ప్రస్తుత పరిస్థితి ఏంది?**

ద్విసభ్య ధర్మాసనంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, వివాదం మరింత జాప్యం కాకుండా ఉండేందుకు ఇద్దరు న్యాయమూర్తులు ఈ అంశాన్ని తగిన సంఖ్యాబలం కలిగిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ప్రస్తుతం ఈ చట్టం రాజ్యాంగబద్ధత, పార్లమెంటరీ అధికార పరిమితులు, ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతకు సంబంధించిన తుది తీర్పు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణపై ఆధారపడి ఉన్నది.

# ఢిల్లీలో బిజీగా చంద్రబాబు

**కేంద్రమంత్రులతో చర్చలు**

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన పెండింగ్ అంశాలపై ఈ భేటీలో చర్చించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై కేంద్రం దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అమిత్ షాను ఆయన విజ్ఞప్తి చేశారు. జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన ఇతర అంశాల పురోగతిపై కూడా ఈ సందర్భంగా సమీక్ష జరిపినట్లు సమాచారం. రాష్ట్ర విభజన హామీలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించడంలో కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది.

**ప్రాజెక్టుల పురోగతిని సీఆర్ పాటిల్‌కు వివరించిన చంద్రబాబు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కీలక జల ప్రాజెక్టుల పురోగతిని, నిధుల అవసరాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ముఖ్యంగా పోలవరం, జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.30,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార' పథకం వివరాలను చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకు గాను ఇప్పటికే 62 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఈ కొత్త పథకం ద్వారా మరో 27 లక్షల కుటుంబాలకు నీటి కనెక్షన్లు అందించడమే లక్ష్యమని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కూడా ఇరువురు నేతలు సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా సాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా కేంద్రం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు నదుల అనుసంధానం అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. రెండు రోజుల పర్యటన నిమిత్తం చంద్రబాబు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు.

**ఆర్థిక మంత్రికి వినతులు**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు. పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.

# ఎక్స్పైరీ సరుకులపై ప్రశ్నిస్తే.. ఐడీలు బ్లాక్ చేస్తారా?

**హస్తినాపురం ఇన్స్టామార్ట్పై డెలివరీ రైడర్ల ఆరోపణలు**

**కనీస సౌకర్యాలు కూడా లేవంటూ ఆవేదన.. విచారణకు డిమాండ్**

**ఎల్బీనగర్:** హస్తినాపురం జడ్పీ రోడ్డులోని ఇన్స్టామార్ట్లో అక్కడ పనిచేస్తున్న కొందరు డెలివరీ రైడర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కస్టమర్లకు డెలివరీ చేస్తున్న సరుకుల విషయంలో అనుమానాలు వ్యక్తం చేసి యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు తమపై వేధింపులకు పాల్పడుతున్నారని రైడర్లు ఆరోపిస్తున్నారు.

**ఎక్స్పైరీ సరుకులపై ప్రశ్నించడంతో ఐడీలు బ్లాక్?**

ఎక్స్పైరీ తేదీ దాటిన సరుకులు కస్టమర్లకు పంపుతున్నారనే అనుమానంతో ప్రశ్నించగా.. తమ స్విగ్గి ఇన్స్టామార్ట్ రైడర్ ఐడీలను బ్లాక్ చేశారని పలువురు రైడర్లు చెబుతున్నారు. తమ ఐడీలను ఎందుకు బ్లాక్ చేశారనే దానిపై స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు కేసుల భయపెడుతున్నారంటూ ఆరోపణలు తమను భయపెట్టేందుకు తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని రైడర్లు ఆరోపిస్తున్నారు. అక్కడ పనిచేసే మహిళా సిబ్బందిని ఉపయోగించి తమపై కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వారు వాపోతున్నారు. అయితే ఈ ఆరోపణలపై యాజమాన్యం స్పందన తెలియాల్సి ఉంది. కనీస సౌకర్యాలు కూడా లేవు.. రోజంతా ఎండ, వానను లెక్కచేయకుండా రోడ్లపై తిరుగుతూ డెలివరీలు చేసే తమకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని రైడర్లు చెబుతున్నారు. తాగునీరు, వాష్రూమ్ వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీమ్ లీడర్లు, మేనేజర్లకు చెప్పినా స్పందన లేదంటూ ఆవేదన తమ సమస్యలను టీమ్ లీడర్లు, మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లభించడం లేదని రైడర్లు అంటున్నారు. పని ఒత్తిడి, డెలివరీ సమస్యలు, ఐడీ బ్లాకింగ్ వంటి అంశాలపై తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలకు డిమాండ్ ఎక్స్పైరీ అయిన వస్తువులు ఆన్లైన్ ద్వారా కస్టమర్లకు చేరుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే.. ఇది వినియోగదారుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశంగా మారుతుంది. దీంతో హస్తినాపురం ఇన్స్టామార్ట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైడర్లు, స్థానికులు కోరుతున్నారు. ఐడీలు అన్బ్లాక్ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి గిగ్ వర్కర్ల భద్రత, సంక్షేమంపై చర్చ జరుగుతున్న సమయంలో.. రోజంతా రోడ్లపై పనిచేసే డెలివరీ రైడర్లకు కనీస సౌకర్యాలు లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమ రైడర్ ఐడీలను వెంటనే అన్బ్లాక్ చేసి, సమస్యలపై న్యాయం చేయాలని రైడర్లు కోరుతున్నారు. హస్తినాపురం ఇన్స్టామార్ట్లో ఎక్స్పైరీ సరుకుల ఆరోపణలు, రైడర్ ఐడీల బ్లాకింగ్, తప్పుడు కేసుల ఆరోపణలు, కనీస సౌకర్యాల కొరతపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని రైడర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వెల్దండ మండలం అజిలాపూర్లో ఉద్రిక్తత

**నాగర్ కర్నూల్:** వెల్దండ మండలం అజిలాపూర్ లో ఉద్రిక్తత నెలకొంది. ఇర్విన్ రిజర్వాయర్ కోసం భూ సర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. భారీ పోలీసు బలగాల మధ్య భూ సర్వేకు యత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పచ్చని పంట పొలాల్లోకి అధికారుల రాకపై రైతులు అభ్యంతరం తెలిపారు. మా అనుమతి లేకుండా పొలాల్లోకి ఎలా వస్తారంటూ అధికారులను నిలదీసారు. పచ్చని పంట పొలాల్లో చిచ్చు పెట్టొద్దంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. కొడంగల్లో ఇచ్చినట్టుగా ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. పరిహారం విషయంలో స్పష్టత లేకుండా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తెగేసి చెప్పారు. ఎంతటి త్యాగానికైనా సిద్ధమంటూ హెచ్చరించారు. రైతుల పక్షాన సర్పంచ్ రమేష్ గౌడ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు--రైతుల మధ్య తీవ్ర వాగ్వాదంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గురువారం ఉదయం కుడా భూ సర్వేపై అజిలాపూర్లో రైతుల నిరసన కొనసాగింది.

## బిజినెస్

# రుణ గ్రహీతలకు ఆర్‌బీఐ షాక్..
# ఇంటి, వాహన రుణాలపై పెరగనున్న వడ్డీ రేటు..!

### పోస్ట్ పెయిడ్ కస్టమర్లకు షాకిచ్చిన ఎయిర్‌టెల్.. టారిఫ్‌ల ధరలు పెంపు..!




దేశంలోని ప్రముఖ టెలికామ్ సంస్థ భారతీ ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు షాకిచ్చింది. పోస్ట్‌పెయిడ్ ప్లాన్ల టారిఫ్‌లను సుమారు 3 నుంచి 10 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు ఈ నెల 8వ తేదీ (గురువారం) నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ స్పష్టంచేసింది. అయితే ధరల పెంపుతోపాటు వినియోగదారులను ఆకర్షించేందుకు కొత్తగా ఉచిత అంతర్జాతీయ రోమింగ్ ప్రయోజనాన్ని కూడా జోడించింది. తాజాగా సవరించిన ప్లాన్‌లు అన్నింటిలోనూ ప్రతి సిమ్‌కు ఏడాదికి ఒకసారి ఉచితంగా అంతర్జాతీయ రోమింగ్ ప్యాక్‌ను అందిస్తున్నట్లు ఎయిర్‌టెల్ తెలిపింది. ఈ కాంప్లిమెంటరీ ప్యాక్‌లో భాగంగా 5 రోజుల వ్యాలిడిటీతో 5జీబీ డేటా, 60 నిమిషాల కాల్స్, 25 అవుట్‌గోయింగ్ ఎస్ఎంఎస్, ఉచిత ఇన్‌కమింగ్ ఎస్ఎంఎస్ వంటి ప్రయోజనాలు లభిస్తాయి. తరచూ విదేశీ ప్రయాణాలు చేసేవారికి ఈ కొత్త బెనిఫిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ భావిస్తున్నది. ఈ ప్లాన్ల కింద అపరిమిత డేటా, కాలింగ్ సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయి. నూతన మార్పుల ప్రకారం.. వ్యక్తిగత కనెక్షన్ల కోసం ఉద్దేశించిన రూ.449 ప్లాన్ ధరను రూ.499కి పెంచారు. ఇక ఫ్యామిలీ ప్లాన్ల విషయానికొస్తే.. గతంలో రెండు సిమ్‌ల కోసం రూ.699గా ఉన్న ప్లాన్ ధర ఇప్పుడు రూ.749కి చేరింది. మూడు సిమ్‌లతో లభించే రూ.999 ప్లాన్ కోసం ఇకపై రూ.1,049 చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా నాలుగు సిమ్‌ల కోసం రూ.1,249, రూ.1,449 ధరలతో ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. ఐదు సిమ్‌లతో పాటు నెట్‌ఫ్లిక్స్ స్టాండర్డ్ సబ్‌స్క్రిప్షన్‌తో వచ్చే ప్లాన్ ధరను రూ. 1,799గా నిర్ణయించారు. ఈ మార్పులపై భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ అమిత్ త్రిపాఠి మాట్లాడుతూ.. భారత మార్కెట్లో తమ పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు అత్యుత్తమ శ్రేణి అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ నెట్‌వర్క్ అనుభవంతోపాటు 5+పై ఫాస్ట్ లేన్ టెక్నాలజీ, స్పామ్, మోసాల నుంచి నిరంతర రక్షణ కల్పిస్తున్నామన్నారు.

### ప్రభుత్వ స్కీముల్లో ప్రైవేట్ బ్యాంకులు



**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా సహా ఆర్థిక సమ్మిళితత్వానికి సంబంధించిన ప్రభుత్వ పథకాల్లో మరింతగా పాలుపంచుకో వాలని ప్రైవేట్ బ్యాంకులకు ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి సంజయ్ లోహియా సూచించారు. ఇందుకు సంబంధించి అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ రంగ బ్యాంకుల చీఫ్‌లతో భేటీ సందర్భంగా ఆయన ఈ విషాలు తెలిపారు. అణగారిన వర్గాల ప్రజలకు సేవలందించడంపైనా, వారి బ్యాంకింగ్ అవసరాలను తీర్చడంపైనా మరింతగా దృష్టి పెట్టాలని ప్రైవేట్ బ్యాంకులను ఆయన కోరారు. భేటీ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాల పురోగతిని సమీక్షించినట్లు ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దాంతో రెపోరేటు 5.50 శాతానికి చేరింది. ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేటుకు హౌసింగ్, వెహికల్ లేదా ఇతర స్థిరాస్తి లోన్ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజులపాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతోపాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటును 5.75 శాతానికి పెంచారు. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దాంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జూలైలో ఇది 4.45 శాతంగా ఉంది. అదేవిధంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపోరేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపోరేటు పెరగవచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండవచ్చని ఎస్‌బీఐ రిసెర్చ్ పేర్కొన్నది.




#### పెరిగిన వడ్డీ భారం మీ లోన్‌పై ఏవిధంగా ప్రభావితం చూపుతుంది?

ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేటుకు హౌసింగ్, వెహికల్ లేదా ఇతర స్థిరాస్తి లోన్ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఈ వడ్డీ భారాన్ని ఆయా బ్యాంకులు రెండు రకాలుగా వినియోగదారునిపై వేయనున్నాయి. నేరుగా ఈఎంఐపైన వేస్తే మీరు చెల్లించే నెలవారి ఈఎంఐ పెరుగుతుంది. అలా కాకుండా లోన్ కాలవ్యవధి పైన కూడా వేయవచ్చు. అంటే.. ఈఎంఐలో తేడా రాకుండగ మొత్తం లోన్ చెల్లించే కాల వ్యవధి పెరుగుతుంది. బ్యాంకును సంప్రదించి ఈ రెండింటిలో ఏది మీకు వర్తించింది అనేది తెలుసుకోవచ్చు. ఈఎంఐ పెంచుకోవడం మంచిదా? లేక లోన్ కాలవ్యవధి పెంచుకుంటే మంచిదా అనేది ఆర్థిక నిపుణులను అడిగి తెలుసుకోవాలి.

# ఆర్బీఐ రెపో రేట్ పెంపు ప్రభావం..
# భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్

భారత స్టాక్ మార్కెట్ బుధవారం భారీగా నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 429 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 173 పాయింట్లు నష్టపోయింది. రెపో రేట్ పెంచుతూ ఆర్బీఐ తీసుకున్న నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. రెపో రేటును ఆర్బీఐ 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) పెంచడంతో రెపో రేటు మొత్తం 5.50 శాతానికి పెరిగింది. 2023 ఫిబ్రవరి తర్వాత రెపో రేటును ఆర్బీఐ పెంచింది. ఈ నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో స్టాక్ మార్కెట్ నష్టాల్లో కొనసాగింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు (0.59 శాతం) నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 173.05 పాయింట్లు (0.76 శాతం) నష్టపోయి 22,603.05 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 76.43 పాయింట్లు (0.43 శాతం) నష్టపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 15.71 పాయింట్లు (0.17 శాతం) లాభపడింది. నిఫ్టీ మెటల్ షేర్లు 2.33 శాతం పడిపోగా, నిఫ్టీ ఆటో 1.58 శాతం నష్టపోయింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ మాత్రం ఒక శాతం లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ స్వల్పంగా బలహీనపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో కోటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా కోటక్ బ్యాంక్ షేర్లు 2.21 శాతం లాభపడ్డాయి. మరోవైపు ఏసియన్ పెయింట్స్, ఎల్ అండ్ టీ, ఇన్ఫోసిస్, బీఈఎల్, టైటాన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా నష్టపోయింది టైటాన్ (3.52 శాతం). డాలర్‌తో 45 పైసలు పడిపోయిన రూపాయి 96.77 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర స్వల్పంగా పెరిగింది. 0.98 శాతం పెరిగిన బ్యారెల్ క్రూడాయిల్ ధర 101.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# దంచికొట్టిన వార్నర్..
# బంగ్లాదేశ్‌పై ఆసీస్ ఘన విజయం

వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2026 టోర్నీలో ఇవాళ ఆస్ట్రేలియా ఛాంపియన్స్, బంగ్లాదేశ్ ఛాంపియన్స్ జట్లు తలపడ్డాయి. షార్జా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బంగ్లాదేశ్‌పై 37 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ (38 బంతుల్లో 66; 7 ఫోర్లు, 4 సిక్సర్లు), కల్లమ్ ఫెర్గూసన్ (36 బంతుల్లో 63; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపు అర్ధ శతకాలతో సత్తా చాటారు. వికెట్ కీపర్ బెన్ డంక్ (45 నాటౌట్) కూడా బ్యాట్ ఝులిపించాడు. బంగ్లా బౌలర్లలో అబు జయేద్ 3 వికెట్లు పడగొట్టగా.. జియావుర్ రహ్మాన్ 2, రుబెల్ హొసేన్ ఓ వికెట్ దక్కించుకున్నారు. భారీ లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేకపోయింది. కెప్టెన్ మహ్మదుల్లా (73 నాటౌట్) ఒంటరిపోరాటం చేసినా తన జట్టును గెలిపించలేకపోయాడు. నిర్ణీత ఓవర్లలో ఆ జట్టు 6 వికెట్ల నష్టానికి 166 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆసీస్ బౌలర్లలో ఫవాద్ అహ్మద్ 2, బెన్ హిల్ఫెన్హాస్, కేన్ రిచర్డ్‌సన్, డి ఆర్కీ షార్ట్ తలో వికెట్ పడగొట్టారు.



### టీ20ల్లో ఏడవ ర్యాంక్‌కు చేరిన శ్రేయాస్ అయ్యర్

**దుబాయ్:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్ సెంచరీ కొట్టిన శ్రేయాస్ అయ్యర్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. కెరీర్‌లోనే బెస్ట్ ర్యాంక్ అందుకున్నాడు. 43 బంతుల్లో 102 రన్స్ చేసిన అయ్యర్.. టీ20ల్లో ప్రస్తుతం ఏడవ ర్యాంక్‌కు చేరుకున్నాడు. మరో వైపు వన్డే కెప్టెన్ శుభమన్ గిల్.. ఆ ఫార్మాట్ బ్యాటింగ్ పొజిషన్‌లో టాప్‌లో ఉన్నాడు. తొలి టీ20లో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన శ్రేయాస్ ఏకంగా 18 స్థానాలను మెరుగుపరుచుకున్నాడు. ఆ ఫార్మాట్‌లో బెస్ట్ ర్యాంక్ సాధించిన మూడవ భారత బ్యాటర్‌గా నిలిచాడు. టీ20ల్లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. తిలక్ వర్మ 10వ స్థానంలో నిలిచాడు. టాప్-10 స్థానాల్లో నలుగురు భారత బ్యాటర్లు ఉండడం గమనార్హం. యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ 8 స్థానాలు ఎగబాకి 46వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.



## స్పోర్ట్స్

### సూపర్ కింగ్స్‌లోకి పొలార్డ్



వెస్టిండీస్ దిగ్గజ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో జట్టు మారాడు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్ కేప్‌టౌన్‌కు ఆడిన అతడు.. 2027 సీజన్ కోసం? జోబర్గ్ సూపర్ కింగ్స్‌తో జతకట్టాడు. ఇవాళ జరిగిన వేలంలో పోలార్డ్‌ను సూపర్ కింగ్స్ సొంతం చేసుకుంది. వేలానికి ముందు కేప్‌టౌన్ పోలార్డ్‌ను విడుదల చేసింది. దీంతో అతను 1.5 మిలియన్ ర్యాండ్‌ల (సుమారు రూ. 87 లక్షలు) బేస్‌ప్రైజ్‌తో వేలంలోకి వచ్చాడు. పోలార్డ్ సూపర్ కింగ్స్ జట్టులో విండీస్ సహచరులు జేసన్ హోల్డర్, అకీల్ హొసేన్ తదితరులతో కలుస్తాడు.

2027 సీజన్ కోసం జోబర్గ్ సూపర్ కింగ్స్ నిలుపుకున్న ఆటగాళ్లు..

జొరెన్ బాచర్, మాథ్యూ డివిలియర్స్, లియుస్ డు ప్లూయ్, డోనోవన్ ఫెరీరా, దయాన్ ఫారెస్టర్, అకీల్ హొసేన్ (వెస్టిండీస్), డువాన్ జాన్సెన్, రిలీ రోసోవ్, జాంకో స్మిత్, ప్రేనెలన్ సుబ్రాయెన్, జేమ్స్ విన్స్ (ఇంగ్లండ్)

ప్రీ సైనింగ్: జేసన్ హోల్డర్ (వెస్టిండీస్)

కాగా, ఇవాళ జరుగుతున్న వేలంలో పోలార్డ్‌తో పాటు ట్రెంట్ బౌల్ట్, ఫాఫ్ డుప్లెసిస్ మార్కీ ప్లేయర్లుగా బరిలో ఉన్నారు. మొత్తం 19 ఖాళీల కోసం ఇవాల్టి వేలం జరుగుతుంది. 2027 సౌతాఫ్రికా టీ20 లీగ్ జనవరి 17 నుంచి ఫిబ్రవరి 21 వరకు జరగనున్న విషయం తెలిసిందే.

వార్తాతరంగాలు



## దశరథ మహారాజుగా అరుణ్ గోవిల్.. 'రామాయణం' నుంచి ఫస్ట్ లుక్!

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' నుంచి తాజాగా మేకర్స్ మరో ఆసక్తికర అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అయోధ్య రాజు దశరథుడిగా నటిస్తున్న సీనియర్ నటుడు అరుణ్ గోవిల్ పోస్టర్‌ను చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. గతంలో రామానంద్ సాగర్ తెరకెక్కించిన ఐకానిక్ టీవీ సీరియల్ 'రామాయణ్'లో రాముడి పాత్రలో నటించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అరుణ్ గోవిల్, దశాబ్దాల తర్వాత మళ్లీ అదే రామాయణ కథలోకి రావడం విశేషం. ఒకప్పుడు ఒక తరానికి రాముడిని పరిచయం చేసిన ఆయన, ఇప్పుడు అయోధ్య రాజుగా రామాయణ ప్రపంచంలోకి తిరిగి వస్తున్నారు. దశరథుడిగా అరుణ్ గోవిల్ అంటూ చిత్రబృందం రాసుకొచ్చింది. ఈ పోస్టర్‌లో 68 ఏళ్ల అరుణ్ గోవిల్ రాజసంగా అయోధ్య సింహాసనంపై కూర్చున్నట్లుగా కనిపించారు. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తుండగా, అరుణ్ గోవిల్ కీలకమైన దశరథ మహారాజు పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా మొదటి భాగం నవంబర్ 6, 2026న దీపావళి కానుకగా విడుదల కానుండగా, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ చిత్రం విడుదల కానుంది.



## బేబీ బంప్‌తో సమంత స్టన్నింగ్ లుక్.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న గ్లామరస్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రత్యేకమైన ఫ్యాషన్ లుక్‌లో సమంత ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా బ్లాక్ కేప్-స్టైల్ టాప్, మెరిసే సీక్విన్ స్కర్ట్‌లో ఆమె కనిపించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సమంత తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ సాటిన్ హై-నెక్ టాప్ ధరించారు. దానికి ఫ్లోర్ లెంగ్త్ కేప్ స్లీవ్స్ జోడించడంతో ఆమె లుక్‌కు మరింత రాయల్ టచ్ వచ్చింది. డార్క్ బ్రాంజ్, బ్లాక్ సీక్విన్ డిజైన్‌తో ఉన్న హై-వెయిస్ట్ స్కర్ట్ ఈ మొత్తం లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎంతో స్టైలిష్‌గా కనిపించేలా ఈ లుక్‌ను రూపొందించారు. సమంతకు సంబంధించిన స్టైలింగ్, ఆభరణాలు, హెయిర్‌స్టైల్, మేకప్ మొత్తం కలిసి ఫోటోషూట్‌కు మరింత గ్లామర్‌ను తీసుకొచ్చాయి. తాజా ఫొటోల్లో సమంత తనదైన కాన్ఫిడెంట్ స్టైల్‌తో కనిపించారు. ఆమె ఫొటోలు సోషల్ మీడియాలోకి వచ్చిన వెంటనే అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. సమంత కొత్త లుక్ చాలా అందంగా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం సమంతకు సంబంధించిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆమె ఫ్యాషన్ సెన్స్, స్టైలిష్ లుక్‌పై అభిమానులు ప్రత్యేకంగా కామెంట్లు చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాణ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆమె నిర్మాణంలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అదే సమయంలో 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్ తమిళం' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తూ.. మరోవైపు 'రక్త బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లోనూ భాగమవుతున్నారు. దీంతో వ్యక్తిగత విషయాలతో పాటు వరుస ప్రాజెక్టులతోనూ సమంత ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తున్నారు.




## సంక్రాంతి రేసు నుంచి 'విశ్వంభర' ఔట్.. మార్చిలో మెగాస్టార్ డబుల్ ట్రీట్!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ విజువల్ వండర్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తికావడంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే విషయంలో కొంతకాలంగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు త్వరలోనే తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం.. 'విశ్వంభర'ను 2027 మహాశివరాత్రి సందర్భంగా మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వాస్తవానికి 'విశ్వంభర' ఎప్పుడో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ ఇది సోషియో ఫాంటసీ కథ కావడంతో సినిమాలోని విజువల్స్, గ్రాఫిక్స్ అత్యంత సహజంగా, అద్భుతంగా కనిపించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఎక్కువ సమయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో పనులు చేయించినట్లు సమాచారం. క్వాలిటీ విషయంలో రాజీపడకపోవడం వల్లే సినిమా విడుదలలో ఆలస్యం జరిగినట్లు టాక్. ప్రస్తుతం సినిమా తుది కాపీకి సంబంధించిన పనులు పూర్తయినప్పటికీ.. భారీ స్థాయి చిత్రానికి సరైన విడుదల తేదీ, సోలో రిలీజ్ అవకాశాన్ని చూసుకుంటున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మెగాస్టార్ చిరంజీవి సినిమాలకు సంక్రాంతి సీజన్ ప్రత్యేకమైనది. దీంతో 'విశ్వంభర' కూడా 2027 సంక్రాంతి బరిలోకి వస్తుందని గతంలో ప్రచారం జరిగింది. అయితే అదే సమయంలో చిరంజీవి-బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మరో భారీ చిత్రం 'కాకా'ను జనవరి 13న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఒకే హీరో నటించిన రెండు భారీ చిత్రాలు ఒకే పండుగ సీజన్‌లో విడుదలైతే కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. దీంతో రెండు సినిమాల మధ్య పోటీ లేకుండా 'విశ్వంభర'ను సంక్రాంతి రేసు నుంచి తప్పించి మార్చిలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. 'విశ్వంభర'ను మహాశివరాత్రి సీజన్‌కు తీసుకురావడం వెనుక మరో కారణం కూడా ఉందని తెలుస్తోంది. ఫాంటసీ కథాంశం, దైవిక అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు శివరాత్రి పండుగ వాతావరణం మరింతగా కలిసొస్తుందని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం.అదే జరిగితే సంక్రాంతికి 'కాకా'తో సందడి చేయనున్న చిరంజీవి.. కేవలం రెండు నెలల వ్యవధిలోనే మార్చిలో 'విశ్వంభర'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఒకే ఏడాది తొలి మూడు నెలల్లోనే మెగాస్టార్ నుంచి రెండు భారీ చిత్రాలు విడుదల కానుండటం అభిమానులకు డబుల్ ట్రీట్‌గా మారనుంది.



## 'ఆయా షేర్' వీడియో సాంగ్ విడుదల.. ఈ పాటతోనే 'ది ప్యారడైజ్'చిత్రానికి భారీ హైప్!

నేచురల్ స్టార్ నాని హీరోగా, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమా విడుదలకు ముందే పాటలు, మాస్ ఎలివేషన్స్‌తో 'ది ప్యారడైజ్' సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఇక ఈ చిత్రానికి సంబంధించిన తొలి పాట 'ఆయా షేర్' ఇప్పటికే ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుంది యూట్యూబ్‌తో పాటు డిజిటల్ వేదికలపై కూడా ఈ సాంగ్ అనేక రికార్డులు సాధించింది. దీంతో పాటు 'ది ప్యారడైజ్' మ్యూజికల్ ప్రమోషన్స్‌లో ఈ పాట కీలకంగా మారింది. తాజాగా ఈ పాటకి సంబంధించిన ఫుల్ వీడియో విడుదల చేశారు. ఈ పాటలోని నాని సిగ్నేచర్ స్టెప్పులకి ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. 'ఆయా షేర్' పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన హై-వోల్టేజ్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కాసర్ల శ్యామ్ రాసిన ఎనర్జిటిక్ సాహిత్యానికి అద్దుల జంగిరెడ్డి, అర్జున్ చాందీ తమదైన శైలిలో గాత్రాన్ని అందించారు. పాటలోని క్యాచీ ట్యూన్, పవర్‌ఫుల్ బీట్స్, మాస్ కొరియోగ్రఫీ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి.యూత్, కాలేజీ విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకుల్లో ఈ పాటకు మంచి క్రేజ్ ఏర్పడింది. సోషల్ మీడియా రీల్స్ నుంచి పబ్లిక్ ఈవెంట్స్, వేడుకల వరకు 'ఆయా షేర్' సందడి కనిపించింది. ముఖ్యంగా పాటలోని బీట్స్, హుక్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకోవడంతో ఇది సెలబ్రేషన్ సాంగ్‌గా మారిపోయింది. 'దసరా' వంటి ఊరమాస్ విజయాన్ని అందించిన శ్రీకాంత్ ఓదెల.. 'ది ప్యారడైజ్'లో నానిని మరింత రగ్గడ్, పవర్‌ఫుల్ పాత్రలో చూపించారు. నాని లుక్, బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఇప్పటివరకు కనిపించని విధంగా నాని కొత్త అవతార్‌లో కనిపించడం సినిమాపై అంచనాలు మరింత పెంచింది. కాయాదు లోహర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, రాఘవ్ జుయల్, బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో నటించారు.

# టీ పీసీసీ చీఫ్ సహా పలువురు మంత్రుల అరెస్ట్

**లోక్ భవన్ ముట్టడించడమే కారణం**

**హైదరాబాద్, అక్టోబరు 8:** హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలు ముమ్మాటికీ అక్రమమని, అప్రజాస్వామికమని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టి పారదర్శకమైన ప్రక్రియను చేపట్టే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం



వీధిపోరాటాలు చేస్తుందని తేల్చిచెప్పింది. ముట్టడి నేపథ్యంలో రాజ్‌భవన్, లోక్ భవన్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా భద్రతను పెంచారు.

తెలంగాణ టార్గెట్ చేశారు

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. “బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి” అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పోరాటం ఆగదన్న రేవంత్

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. “గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు” అని ఆయన ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# ఎన్నికల కమిషనర్ల నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన 2023 చట్టంపై దాఖలైన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం జరిగింది. ఈ అంశంపై సెప్టెంబర్ 23న వెలువడిన భిన్నమైన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ప్రధాని, లోక్‌సభ విపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ చేసే సిఫార్సుపై సీఈసీ, ఈసీల నియామకాలను రాష్ట్రపతి చేస్తారని 2023 మార్చి 2న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. సీజేఐ బదులు కేంద్ర మంత్రికి అవకాశమిస్తూ ఆ ఏడాది డిసెంబరులో పార్లమెంటులో చట్టాన్ని రూపొందించడంతో దాని రాజ్యాంగబద్ధ చెల్లుబాటును పలువురు సవాల్ చేశారు. ఈ పిటిషన్లను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా? అనే అంశంపై సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ అంశంపై ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఫలితంగా భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి.

**భిన్న తీర్పులు**

ఈ కేసును మరింత విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలని కేంద్రం కోరింది. అయితే జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ అభ్యర్థనను తిరస్కరించారు. ఎంపిక కమిటీలో ఒక క్యాబినెట్ మంత్రిని చేర్చడం వల్ల దాని తటస్థ స్వరూపం పోతుంది. 2023 చట్టం కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రాయపడ్డారు. విపక్ష నేత ఉనికి నామమాత్రం అవుతుందని, కమిటీలో ఆయనను చేర్చిన ఉద్దేశం అలంకారప్రాయంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కానీ, జస్టిస్ దత్తా వ్యాఖ్యను వ్యతిరేకిస్తూ, కేంద్ర వాదనను జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఏకీభవించారు. ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై



విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో తదుపరి చర్యల కోసం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వద్దకు పరిపాలనా పరంగా పంపాలని ద్విసభ్య ధర్మాసనం నిర్ణయించింది. తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, అంశంపై సమర్థవంతమైన, తుది నిర్ణయం తీసుకునేలా చేయాలని సూచించింది.

**తీర్పు వెనక్కి తీసుకోవాలంటూ పిటిషన్**

ఈ పరిణామాల నేపథ్యంలో భిన్నమైన తీర్పును రీకాల్ చేయాలని కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలైంది. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ బుధవారం ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావించారు. పిటిషన్‌ను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీజేఐ తెలిపారు. తమ పిటిషన్?కు సంబంధించిన వివరాలను ధర్మాసనానికి న్యాయవాది గోపాల్ వివరించారు. తొలుత ఈ రీకాల్ పిటిషన్?ను జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించినట్లు చెప్పారు. అయితే అనంతరం ఆ ధర్మాసనం నుంచి కేసును తప్పించారని, ప్రధాన న్యాయమూర్తి ముందు ఈ విషయాన్ని ప్రస్తావించాలని సూచించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే క్యూరేటివ్ పిటిషన్ కూడా దాఖలైందని ఆయన కోర్టుకు వెల్లడించారు. అయితే క్యూరేటివ్ పిటిషన్‌కు, ప్రస్తుతం దాఖలు చేసిన రీకాల్ పిటిషన్‌కు తేడా ఉందని స్పష్టం చేశారు. క్యూరేటివ్ పిటిషన్ తనదైన న్యాయపరమైన ప్రక్రియలో ముందుకు వెళ్లాల్సి ఉంటుందని, ప్రస్తుత దరఖాస్తు మాత్రం సెప్టెంబర్ 23న వెలువడిన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతోందని వివరించారు.

# ఎల్‌కే అడ్వాణీని కలిసిన ప్రధాని మోదీ

బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అడ్వాణీని ఆయన నివాసంలో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం కలిశారు. ప్రభుత్వాధినేతగా 25ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అడ్వాణీకి మోదీ కలిసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అడ్వాణీ ఆరోగ్య విషయాలను పీఎం మోదీ అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్?లో ఓ పోస్టు షేర్ చేశారు. ‘అడ్వాణీజీని ఆయన నివాసంలో కలిసి, వారి ఆశీస్సులు తీసుకున్నాను. దశాబ్దాల తరబడి ఆయన అందించిన ప్రజా సేవ, జాతీయ జీవనంలో ఆయన చేసిన కృషి చెరగని ముద్ర వేశాయి. భారతదేశ పురోగతిని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు’ అని పేర్కొంటూ అడ్వాణీతో దిగిన తాజా ఫొటోను మోదీ షేర్ చేసుకున్నారు. కాగా, పీఎం మోదీ ప్రభుత్వాధినేతగా నేటితో 25ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేబీ శ్రేణులు సేవా సంకల్ప్ అభియాన్ పేరిట కార్యక్రమాలు నిర్వహించాయి. అంతకుముందు బుధవారం ఉదయాన్ని దిల్లీలోని శ్రీ వినాయక మందిరంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక పూజలు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ విఘ్నహర్త ఆశీస్సులతో అందరికీ మేలు జరగాలని, దేశం నిరంతర ప్రగతిపథంలో సాగాలని మోదీ ఆకాంక్షించారు. అనంతరం దిల్లీలో నిర్వహించిన



వికసిత్ భారత్ సంకల్ప్ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన 25ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఈ స్థాయికి వస్తానని తానెప్పుడూ ఊహించలేదని అన్నారు. పని చేయడమే తన ధర్మమని, దేశం కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి ఓటు బ్యాంకు రాజకీయాలు, కులాల వారీగా సమాజాన్ని విభజించడం అతిపెద్ద అవరోధాలని మోదీ హెచ్చరించారు.

**ప్రపంచం చూపు భారత్ వైపు**

ప్రస్తుతం ప్రపంచమంతా భారత్ వైపే చూస్తోందని అన్ని రంగాల్లో ఆవిష్కరణలతో కొత్త చరిత్ర లిఖించడానికి ఇదే సరైన సమయమని మోదీ పేర్కొన్నారు. ఒకప్పుడు ఉగ్రవాదం పెనుముప్పుగా ఉండేదని ఇప్పుడు భారత్ అభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోందన్నారు. ఈ వేగాన్ని ఎవరూ ఆపలేరన్నారు. భారత తయారీ విమానాల గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు త్వరలో వస్తుందన్నారు. ప్రత్యర్థుల విమర్శలే తనను లోతుగా ఆలోచించేలా చేసి బలోపేతం చేశాయని అన్నారు.

## దిల్లీలో కుప్పకూలిన 5 అంతస్తుల భవనం

దేశ రాజధాని దిల్లీలోని సీమాపురిలో ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో గర్భిణి, ఒక చిన్నారి ఉండడం స్థానికంగా అందర్నీ కలచివేస్తుంది. మరో ఎనిమిది మంది ఈ ప్రమాదంలో గాయపడ్డారు. పలువురు భవన శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో భవనం పక్కనే ఉన్న ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనాస్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో కొంతమందిని సురక్షితంగా బయటకు తీశారు. దిల్లీలో నిన్న సంభవించిన భూ ప్రకంపనలు కారణంగానే భవనం కూలి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఇటీవలే దిల్లీలోని సత్యానికేతన్ ప్రాంతంలో బాలుర పీజీ భవనం కుప్పకూలి ఏడుగురు మృతి చెందిన ఘటన మరువకముందే మరో భవనం కుప్పకూలడం భద్రతా వైఫల్యాలను మరోసారి బట్టబయలు చేసింది.

## యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అజయ్ రాయ్ స్థానంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ఆరాధన మిశ్రా మోనాను అధిష్ఠానం నియమించింది. రాష్ట్రంలో చేజారిన బ్రాహ్మణ ఓటు బ్యాంకును



తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, దశాబ్దం క్రితం విఫలమైన పాత వ్యూహాన్నే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ఇటువంటి వ్యూహాన్నే అనుసరించింది. అప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచన మేరకు, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దింపింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 10 నుంచి 12 శాతం ఉన్న బ్రాహ్మణ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే పార్టీకి పూర్వవైభవం లభిస్తుందని అప్పట్లో అంచనా వేసింది. అయితే, ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, తీవ్రంగా బెడిసికొట్టడంతో కాంగ్రెస్ కేవలం ఏడు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మరోసారి అదే బాటలో పయనిస్తున్న కాంగ్రెస్‌కు, ఈసారి మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచే సవాళ్లు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తన ‘పీడీఏ’ (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) నినాదాన్ని మరింత విస్తృతం చేశారు. పీడీఏలోని ‘పి’ అంటే ‘పండిట్’ (బ్రాహ్మణులు) అని కూడా అర్థం చెబుతూ ఆ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణులను విస్మరిస్తోందని ఆయన నిరంతరం విమర్శలు గుప్పిస్తున్నారు.

## ‘ఎంపీలను కొడతారా ఇక్కడి నుంచి కదిలేదే లేదు’



భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా దిల్లీలో ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జంతర్ మంతర్‌కు ర్యాలీగా వెళ్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలను దిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో పోలీసులు తమను ముందుకు వెళ్లకుండా అడ్డుకోవడంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా రోడ్డు మీదే నేలపై పడుకొని నిరసన వ్యక్తం చేశారు. తనను అక్కడి నుంచి లేపేందుకు ప్రయత్నించగా, మహిళా పోలీసులు తనపై దాడి చేశారని, తన శరీరమంతా గోళ్లతో గాయపరిచారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీని కలవాలని వెళ్తుంటే ఎంపీలను కొడతారా? అని ప్రశ్నించారు. ‘నేను ఇక్కడి నుంచి కదిలేది లేదు. కేవలం ఎన్నికల సంఘాన్ని కలవాలనుకున్న ఎంపీలతో వారు ప్రవర్తించే తీరు ఇదేనా? ఈ విధంగా ఎంపీలను కొడతారా? మహిళా పోలీసులు నన్ను గోళ్లతో గాయపరిచి కిందికి తోసేశారు. వారి బలగాలను వెనక్కి పిలవమనండి’ అని ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు జంతర్ మంతర్ సమీపంలోని ఆందోళన స్థలం నుంచి ప్రియాంక గాంధీని బలవంతంగా తరలించారు.

**రాహుల్ సహా పలువురు ఎంపీలు అదుపులోకి**

మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు రెండు గంటల పాటు అదుపులో ఉంచుకుని ఆ తర్వాత విడుదల చేశారు. జంతర్ మంతర్‌కు చేరుకునే క్రమంలో భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఎంపీలు ప్రయాణిస్తున్న బస్సులను కూడా నిరసన ప్రదేశానికి కొంత దూరంలోనే నిలిపివేశారు. ఈ క్రమంలోనే కొందరు కాంగ్రెస్ ఎంపీలు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు.

ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు: మల్లికార్జున ఖర్గేమంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.


REQUIREMENT OF OUTSOURCING STAFF FOR
GOVERNMENT MEDICAL COLLEGE NAGARKURNOOL

| Sl. No. | NAME OF THE POSTS | QUALIFICATION |
| --- | --- | --- |
| 1. | Barber | 1. Must have passed 10th class examination or its equivalent qualification. 2. (3) years experience certificate from Barber Organization / Barber Shop |
| 2. | Carpenter | 1. Must have passed 10th class examination or its equivalent qualification. 2. ITI certificate in Carpenter. |
| 3. | Dhobi | 1. Must have passed 10th class examination or its equivalent qualification. 2. Must have experience for one year in the relevant vocation (Hospitals / Colleges / Education institutes). |
| 4. | Mali / Sub Staff/Manifold Supervisor (Hospital & Medical Admin) | 1. Must have passed 10th class or its equivalent examination |
| 5. | Office Subordinate | 1. Must have passed 10th class examination or its equivalent qualification. |
| 6. | Plumber | 1. Must have passed 10th class examination or its equivalent qualification. 2. ITI certificate in Plumber. |
| 7. | Steno/Data Entry Operator/Store Keeper/Steno Typist/Record Clerk/Record Assistant/Receptionist-Cum Clerk/ Data Entry Operator (EMD)/Clerk/Computer Operator | 1. Degree from a recognized university/Institution; 2. should possess a speed of not less than 8000 key depressions per hour 3. Experience in store keeping will be preferred |

**Address for Apply:** RAM LALLA GLOBAL EXIM,
H.No. 15-102/2/A/1, Ragavendra Colony Road No. 2, Near Telephone Exchange, Nagarkurnool.
Contact: 7036012722
Last Date: 10-10-2026. Selection process under Government Norms.


VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137